# 2

# ప్రతి ఆత్మ సంబంధమైన ఆశీర్వాదములు మరియు సంఘము యొక్క ఉద్దేశము

## (1:3-14)

క్రీస్తునందు ఉన్న అపరిమితమైన ఆశీర్వాదములను బట్టి దేవునికి కృతజ్ఞతా స్తుతులు చెల్లిస్తూ పౌలు తన సహోదరులకు పత్రికను వ్రాయుట మొదలు పెట్టెను (1:3–14). గ్రీకు క్రొత్త నిబంధనలో ఒక్క వాక్యములో పౌలు ప్రతి ఆత్మ సంబంధమైన ఆశీర్వాదములను పరిశుద్ధులకు ఇచ్చుటను బట్టి దేవుని కీర్తించెను మరియు ఏడుకు తక్కువ లేకుండా ఆశీర్వాదములను పేర్కొనెను (ఈ సంఖ్య పరిపూర్ణతకు సూచన). ప్రతిది కూడా దేవునికి మహిమ తెచ్చేదిగా ఉన్నది (1:6, 12, 14 చూడుము). పౌలు మానవుని రక్షణ విషయములో దేవత్వమంతటిని చేర్చి కీర్తించెను, తన మహిమపరచే మాటలు తండ్రియైన దేవుని, దేవుని కుమారుని, మరియు పరిశుద్ధత్మునిపై కేంద్రీకరించెను, ఎందుకనిన, ఆ ముగ్గురు దేవుని సంకల్పములో పాల్గొన్నారు గనుక.

### క్రీస్తునందు ఎన్ను కొనబడుట (1:3, 4)

**3మన ప్రభువైన యేసుక్రీస్తుయొక్క తండ్రియగు దేవుడు స్తుతింపబడును గాక. ఆయన క్రీస్తునందు పరలోకవిషయములలో ఆత్మసంబంధమైన ప్రతి ఆశీర్వాదమును మనకనుగ్రహించెను. 4... తన యెదుట పరిశుద్ధులమును నిర్దోషులమునై యుండవలెనని జగత్తు పునాది వేయబడకమునుపే, ... క్రీస్తులో (ఆయనలో) మనలను ఏర్పరచుకొనెను.**

**వచనము 3. మన ప్రభువైన యేసుక్రీస్తు యొక్క తండ్రియగు దేవుడు స్తుతింపబడును గాక.** 14వ వచనము వరకు కొనసాగే పౌలు యొక్క (doxology) మహిమపరచే మాటలు ఉన్నాయి. "స్తుతింపబడును గాక" అనునది *eulogētos* అను పదము నుండి తర్జుమా చేయబడినది మరియు అది దేవునికి ప్రత్యేకముగా ఆరోపించబడినది–ఎన్నడూ మానవునికి అలా చేయబడలేదు.[1] ఆ విధముగా అది మానవునికి వర్తించని పదము. ఆ పదము "మెచ్చుకొనబడిన" అను అర్థము ఇచ్చునది.[2] మానవుని కొరకైన దేవుని గొప్ప ఏర్పాటును బట్టి ఆయనే స్తుతికి అర్హుడు, దానినే పౌలు చెప్పుటకు మొదలు పెట్టెను.[3]

దేవుడు "మన ప్రభువైన యేసు క్రీస్తు యొక్క తండ్రియగు దేవుడు" అని పిలువబడుట కొంత అసాధరణముగా నున్నది. యేసు సాధరణముగా దేవుని "నా తండ్రి" అని సంబోధించెను గాని, "నా దేవా" అని కొద్ది సార్లు మాత్రమే అనెను (మత్తయి 27:46; యోహాను 20:17 చూడుము). పౌలు ఇక్కడ "మన ప్రభువైన యేసుక్రీస్తు యొక్క తండ్రి"

మరియు "మన ప్రభువైన యేసు క్రీస్తు యొక్క ... దేవుడు" అను రెండు బిరుదులను వాడెను. యేసు ఎన్నడూ "మన దేవుడు" లేదా "మన తండ్రి" అని శిష్యులతో కలుపుకొని అనలేదు, ఎందుకనిన ఆయనకు దైవముతో ఉన్న సంబంధము ప్రత్యేకమైనది. పరలోక ప్రార్థనకు మినహాయింపు ఉన్నది ఎందుకనిన, అది యేసుకు కాదు కాని, శిష్యులకే ఆ ప్రార్థన (మత్తయి 6:9).

యోహాను సువార్త యొక్క ముందు మాట (1:1–18), శరీరధారియైన వాక్యము ఆరంభమునకు ముందే ఉన్నాడని చెప్పుచున్నది. ఇంకా, వాక్యము దేవుని యొద్ద ఉన్నాడు, దేవుని సన్నిధిలో నిజముగా ఉన్నాడు. ("దేవునితో ముఖా ముఖిగా"[4] మరియు ఆయనతో క్రియాత్మకమైన సహవాసమును కలిగి ఉండెను.) వాక్యమే దేవుడై *ఉండెను.* (ఆయన ఏదో ఒక *దేవుడు* కాడు కాని ఆయనే *దేవుడు*, *దేవత్వము* యొక్క గుణలక్షణములన్ని కలిగినవాడు.)[5] ఇదే మాటను పౌలు ఫిలిప్పీ 2లో, "ఆయన దేవుని స్వరూపము కలిగినవాడై యుండి" (6వ వచనము) అని క్రీస్తును గూర్చి చెప్పినప్పుడు క్రీస్తు యొక్క స్వభావమును గూర్చి మాట్లాడెను. "స్వరూపము" అనునది *morphē* అను గ్రీకు పదము యొక్క తర్జుమా, "దేవుడేమైయున్నాడో ఆయన అదంతయునై యున్నాడు" ("all that God is") – "ఆయన యొక్క లోతైన వ్యక్తిత్వం, తనయందు తాను ఏమైయున్నాడో"[6] అని అర్థము. "ఉండెను" అనునది *huparchō* యొక్క తర్జుమా మరియు అది యేసు భూమిపై జన్మించుటకు ముందు ఉన్న స్వరూపమును ఎప్పటికీ కలిగి ఉన్నాడు అని చెప్పుచున్నది.[7] క్రీస్తు దైవత్వం యొక్క తత్వమును కలిగినవాడై యున్నప్పటికీ దేవునితో సమానుడుగా ఉండుటకు హక్కుగలవాడని ఎంచుకొనలేదు. దేవునితో సమానుడుగా ఉన్న క్రీస్తు పరలోకము యొక్క మహిమను విడిచిపెట్టి మరియు, కొంతకాలం, శరీరధారియై, మరియు సంపూర్ణమైన దైవ–మానవ మిళితమై ఉండెను.

యేసు దేవుడు కనుక, ఏ విధముగా దేవుడు ఆయనకు దేవుడు? "క్రీస్తు యొక్క మానవ స్వభావమును బట్టి దేవుడు ఆయనకు దేవుడు."[8] క్రీస్తు యొక్క పనిని బట్టి దేవుడు మనకు కూడ దేవుడు. నిత్యత్వమంతటినుండి, "శరీరధారియై మన మధ్య నివసించిన" (యోహాను 1:14) వానికి దేవుడే "తండ్రియై" యుండెను. యేసు "మన ప్రభువు" గనుక, దేవుడు మనకును తండ్రీ, ఎందుకంటె దత్తత ద్వార మనము ఆయన పిల్లలమైయున్నాము (చూడు ఎఫెసీయులకు 1:5). తండ్రియైన దేవునికి మరియు యేసునకు మధ్య ప్రత్యేకమైన సంబంధము కలదని గుర్తించాలి.

> అద్భుతంగా కన్యక గర్భమందు జన్మించి మరియు మృతులలో నుండి యేసు పునరుత్థానుడైనందున మన ప్రభువైన యేసుక్రీస్తు కుమారుడుగా నియమింపబడ్డాడు(లూకా 1:35; రోమీయులకు 1:3–4). ఆయనకు తండ్రితో ఉన్న సంబంధము ప్రత్యేకమైనది, ఎందుకనిన ఆయన అద్వితీయ కుమారుడు (యోహాను 1:14, 18). హెబ్రీ గ్రంథకర్త కీర్తనలు 1:7 ఉల్లేఖిస్తూ "నీవు నా కుమారుడవు ఈ దినమున నేను నిన్ను కనియున్నానని" చెప్పెను మరియు దీనిని యేసు యొక్క జన్మతో ముడి పెట్టి చూపించెను (హెబ్రీయులకు 1:5). అంతియొకయలో యూదుల మధ్య ప్రసంగించిన పౌలు ఈ మాటనే వాడి పునరుత్థానమును గూర్చి మాట్లాడెను (అపొస్తలుల కార్యములు 13:33). హెబ్రీ పత్రిక, ఆయన కుమారత్వమును ఆయన యొక్క అద్భుత జన్మతో వివరించెను; అపొస్తలుల కార్యములు దీనికి రుజువుగా ఉన్నది.[9]

యేసు దేవుని "అద్వితీయ కుమారుడు" (1 యోహాను 4:9), ఇందులో యేసు మాత్రమే నిత్యత్వమునుండి తండ్రితో ఉన్నవాడై మరియు తరువాత కన్యక గర్భమందు, ఆయన ఉన్నలాగుననే జన్మించెను. ఈ అద్వితీయ ఉనికికి యేసు, "నేను ఇంకను తండ్రియొద్దకు ఎక్కిపోలేదు గనుక నన్ను ముట్టుకొనవద్దు; ... *'నా తండ్రియు మీ తండ్రియు, నా దేవుడును మీ దేవుడునైన వాని యొద్దకు ఎక్కిపోవు చున్నానని'* వారితో చెప్పుమనెను*"* (యెహాను 20:17; నొక్కి చెప్పింది చేర్చబడినది). యేసు యొక్క మానవత్వము సిలువపై నుండి, "నా దేవా నా దేవా నన్నెందుకు విడనాడితివి?" అని కేక వేసెను (మత్తయి 27:46); కాని ఆయన దైవత్వము, "తండ్రీ, నీ చేతికి నా ఆత్మను అప్పగించుకొనుచున్నాను" అనెను (లూకా 23:46).

"సమస్త జీవులకును ఆయన ఆహారమిచ్చుచు" (కీర్తనలు 136:25) మరియు "... నీతిమంతుల మీదను, అనీతిమంతుల మీదను వర్షము కుమ్మరించును" (మత్తయి 5:45) గనుక దేవుడు ప్రతి మనుష్యుని భౌతిక సంబంధమైన ఆశీర్వాదములతో దీవించుచున్నాడు. కాని **ఆత్మ సంబంధమైన ఆశీర్వాదము**[లు] మాత్రము **క్రీస్తునందు** ఉన్న వారికే. ఈ ఆత్మ సంబంధమైన ఆశీర్వాదములు ఆత్మీయ పరిధిలో జీవించు వారికే లభిస్తాయి; దత్తత స్వీకారము క్రైస్తవులను "క్రీస్తునందు" జీవించేలా అనుమతిస్తుంది. (క్రీస్తు నందు ఉన్న "ఆశీర్వాదములు మరియు దీవెనలు" అను పట్టికను ఈ పాఠములో చూడుము.)

ఈ ఆశీర్వాదములు పొందు స్థలమునకు వాడబడిన *epouranios* అను పదమును అక్షరార్థముగా **పరలోక విషయములలో** అని తర్జుమా చేయబడింది ("స్థలములలో" అని అంగ్లములోని తర్జుమా దారులచే చేర్చబడినది).[10] ఎఫెసీ పత్రికలో ఐదు సార్లు మనకు కనబడును (1:3, 20; 2:6; 3:10; 6:12) మరియు పరలోకము అనునది క్రీస్తు సంఘమునకు శిరస్సుగా తండ్రి కుడిపార్శ్వమున కూర్చుండిన చోటు, దీనిని పౌలు మాత్రమే చెప్పెను (1:20–22). "పరలోక సంబంధం" అనునది క్రీస్తునందు ఉన్నవారు ఆయనతో కూడ కూర్చుండు స్థలము (2:6), అక్కడ సంఘము దేవుని యొక్క జ్ఞానమును వెల్లడి పరచును (3:10), మరియు ఈ లోకనాదులతో పోరాడు స్థలము (6:12). ఆ పదము క్రీస్తు కూర్చుండు స్థలము మాత్రమే కాదు కాని, సమస్త ఆత్మ సంబంధమైన పరిధిని సూచిస్తున్నది. "పరలోక సంబంధంలో" దేవుడు కృపాసహితముగా క్రీస్తునందు ప్రతి ఆశీర్వాదమును యిచ్చును.

**వచనము 4.** ప్రస్తావించిన మొదటి ఆత్మ సంబంధమైన ఆశీర్వాదము, **ఆయనలో మనలను ఏర్పరచుకొనెను**. "ఏర్పరచు" అనునది, *eklegomai* అను పదము నుండి వచ్చినది, "ఎంపికచేసుకొనుట, ఎన్నుకొను" అను అర్థము. ఇది క్రొత్త నిబంధనలో వాడిన ప్రతిసారి, "తన కొరకు ఎన్నుకొనుట" అను అర్థము ఇచ్చును.[11] ఈ వచనములో దేవుడే ఎర్పరచుకొనువాడు; ఆయన కొరకు ఏర్పరచుకొనుచున్నాడు మరియు దైవ సంకల్పము నిమిత్తము, తన యిష్టం చొప్పున చేయుచున్నాడు. దేవుడు ఇశ్రాయేలును తన దైవ సంకల్పము కొరకు ఎర్పరచుకొనినట్లు (అపొస్తలుల కార్యములు 13:17) మరియు క్రీస్తు తన అపొస్తలులను దైవ ఉద్దేశం కొరకు ఎన్నుకొనట్లు (లూకా 6:13; యోహాను 15:16–19), అలాగే దైవిక ఉద్దేశం కొరకు దేవుడు మనలను (అనగా, "క్రీస్తునందు" ఉన్న పౌలు మరియు నమ్మకమైన విశ్వాసులైన పరిశుద్ధులులందరు; 1:1) ఏర్పరచుకొనెను.


ఇదేదో దేవుడు యాదృచ్ఛికముగా కొందరిని నిత్య జీవమునకు కొందరిని నిత్య నరకమునకు నిర్ణయించాడా? ఖచ్చితముగా, దేవుడు చేయగలడు, ఆయన తన సార్వభౌమాధికారంలో, దేవుడు ఒక వ్యక్తిని ఎన్నుకొని తన కార్యము జరిగించవచ్చు. ఇశ్రాయేలుకు తండ్రి అగునట్లు దేవుడు అనేకులలో నుండి అబ్రాహామును ఎన్నుకొనెను. మెస్సీయ వచ్చుటకు ఏశావును కాకుండా యాకోబును ఎన్నుకొనెను మరియు మెస్సీయను పంపుటకు ఇతర దేశములను కాక ఇశ్రాయేలును యెన్నుకొనెను. కొందరిని కొన్ని పనుల కొరకు ఎన్నుకొన్నాడని చెప్పడం ద్వారా ఇతరులను గూర్చి దేవుడు అక్కర కలిగియుండలేదని కాదు.

అదే విధముగా, దేవుడు జనులకు అనేకమైన తలాంతులను లేదా సామర్థ్యములను అనుగ్రహించాడు. దేవుని సార్వభౌమాధికారమును ఎవరు ప్రశ్నించగలరు? అయితే, నిత్యమైన రక్షణ విషయములో, వారు చేయునది లేక చేయకూడని దానితో నిమిత్తం లేకుండా కొంతమంది రక్షింపబడాలని మరియు కొంతమంది నశించిపోవాలని దేవుడు నిర్హేతుకంగా ఆజ్ఞాపించడు. దేవుడు రక్షణను ప్రతి మనుష్యునికి అందించును (తీతుకు 2:11); ప్రతి యొక్కరు దేవుని యొద్దకు వచ్చి కృపను పొందమని ఆహ్వానించబడుదురు (చూడు మత్తయి 11:28; ప్రకటన 22:17). అయితే క్రీస్తునందు ఏర్పరచబడిన వారితో ఉండాల లేదా అను నిర్ణయము మానవునికే వదిలిపెట్టబడినది. క్రీస్తునందున్న వారందరు రక్షింపబడుదురని దేవుడు ఆజ్ఞాపించాడు, అయితే విశ్వాసులైన వారు క్రీస్తుయేసు లోనికి బాప్తిస్మము పొందవలెనో లేదో అనే నిర్ణయము చేయుటను మనకేవదిలిపెట్టారు (రోమీయులకు 6:3). ఎవరైతే సువార్తను అంగీకరిస్తారో, వారే ఏర్పరచుకొనబడినవారు మరియు క్రీస్తునందు ఉన్నవారు. "తండ్రియైన దేవుని భవిష్యత్ జ్ఞానమునుబట్టి, ఆత్మ వలన పరిశుద్ధత పొందినవారై విధేయులగుటకును, యేసుక్రీస్తు రక్తమువలన ప్రోక్షింపబడుటకును ఏర్పరచబడిన …" వారిని గూర్చి పేతురు మాట్లాడెను (1 పేతురు 1:1, 2).

ఏర్పరచబడినవారు క్రీస్తుకు విధేయులగుటకు కోరుకొనిరి. ఎప్పుడైతే ఒక వ్యక్తి క్రీస్తుకు లోబడుటకు కోరుకొనునో, ఆ వ్యక్తి ఏర్పరచుకొనబడిన వారిలో ఉండును, ఎవరు రక్షింపబడుదురో లేదా నశించి పోదురో అని ముందుగా తెలుసుకొనుట దేవునికి సాధ్యమే కాని దేవుడు కొందరిని రక్షణకు మరి కొందరిని నరకమునకు ముందుగానే నిర్ణయించుననునది లేఖనానుసారము కాదు. మానవుని యొక్క స్వేచ్ఛను బైబిలు గట్టిగా చెబుతుంది. డి. ఎల్. మూడి ఈ విధముగా చెప్పాడు, "ఎవరైతే అంగీకరిస్తారో వారే ఏర్పరచబడినవారు, ఎవరు అంగీకరించరో వారు ఏర్పరచబడిన వారు కారు."[12]

క్రీస్తునందు ఉన్న ప్రతి వారిని దేవుడు ఏర్పరచుకొని వారిని విమోచించును మరియు దేవునిచేత ఎన్నుకోవడం అనే **ఏర్పాటు జగత్తుపునాది వేయబడకమునుపే జరిగెను**. "పునాది" అను పదము *katabolē* అను గ్రీకు పదము నుండి వచ్చినది మరియు *kata* ("క్రిందకు") మరియు *ballō* ("విసిరి వేయుట") "విసిరివేయుట లేక నిర్ధరించుట"[13] అని అర్థము అది దేవుడు ఇంతకు ముందు లేని సృష్టిని సృజించుటను గూర్చి చెప్పుచున్నది. "జగత్తు" అను పదము *kosmos* అను పదము నుండి వచ్చినది "సరియైన మరియు సమరసమైన ఏర్పాటును లేక నిర్మాణమును లేక ఒక క్రమమును సూచిస్తున్నది."[14] కనుక పౌలు "జగత్తు పునాది వేయబడక మునుపే" అని చెప్పినప్పుడు, క్రమముతో కూడిన లోకము దేవుడు సృజించుటకు ముందు అని సూచిస్తుంది. ఈ మాటలు గ్రీకు క్రొత్త

**"క్రీస్తు నందు" ఉండుటవలన ఆశీర్వాదములు మరియు మేలులు**




"క్రీస్తులోనికి" నేను యెట్లు ప్రవేశించగలను?

- గలతీయులకు 3:27 – "క్రీస్తులోనికి" బాప్తిస్మము పొందుట
- రోమీయులకు 6:3, 4 – "క్రీస్తులోనికి" బాప్తిస్మము పొందుట

---

Owen D. Olbricht, *Teacher's Guide for Successful Personal Work* (Delight, Ark.: Gospel Light Publishing Co., 1993), 22. నుండి ఈ చార్టు అనుమతితో వినియోగించడమైనది.

నిబంధనలో 10 సార్లు కనిపించును మరియు అది "ఈ లోకారంభమునకు ముందు" అను విషయమును సూచిస్తున్నది.

కుమారుడు తండ్రి చేత ప్రేమింపబడి (యోహాను 17:24) మరియు మన పాపములకు తన రక్తమును చిందించవలసియున్నదని కాలరంభమునకు ముందు ఉన్న పరిథిలో (realm)

ముందే నిర్ణయించబడినది (1 పేతురు 1:18-20; చూడు KJV). ఆయనే "జగత్తు పునాది వేయబడక మునుపే" వధింపబడిన గొఱ్ఱెపిల్ల (ప్రకటన 13:8; మత్తయి 13:35; 25:34; లూకా 11:50; హెబ్రీయులకు 4:3; 9:26; ప్రకటన 17:8 చూడు). జగత్తు పునాది వేయబడక మునుపే క్రీస్తునందు దేవుని ప్రణాళిక దేవుడు తన మనస్సులో కలిగియుండెను.

ఈ ప్రణాళిక నిత్యమైనది, మార్పు చెందనది, విపులమైనది. వారు దేవుని మనస్సులో నిత్యత్వంనుండి ఉన్నారను జ్ఞానమును చదువరులకు తెలియజేస్తు ఆదరణను, పోత్సాహమును యిచ్చుటకు పౌలు యొక్క వాక్కులు రచించబడ్డాయి. పౌలు ఈ వాస్తవమును సమస్తమైన ఆత్మీయ ఆశీర్వాదములకు కారకుడైన సృష్టికర్తకు కృతజ్ఞతా స్తుతులు చెల్లించు సమయమున చెప్పెను.

**వచనము 4. మనము తన యెదుట పరిశుద్ధులమును నిర్దోషులమునై యుండవలెనని** దేవుడు మనలను ఆశీర్వాదించి, మనలను ఆయన వారిగా చేసుకొనెను. 1వ వచనములో పౌలు చదవరులును "పరిశుద్ధులని" *hagiois*, (*hagios* నుండి) అని సంబోధించాడు మరియు క్రైస్తవులు "పరిశుద్ధులై" యుండాలని ఇక్కడ సూచించిన పదము కూడ అదే గ్రీకు పదమైయుంది. మొదటిది దేవుని యెదుట "క్రీస్తు నందు" ఉన్న వారి స్థితిని సూచిస్తున్నది మరియు రెండవది "ఆ స్థితినిబట్టి వారికి కలిగిన నైతిక స్థితిని" సూచిస్తుంది.[15] "నేను పరిశుద్ధుడను కనుక మీరును పరిశుద్ధులుగా ఉండవలెను" అని దేవుడు చెప్పెను (1 పేతురు 1:16). "నిర్దోషులు" అను మాట *amōmos* అను గ్రీకు పదము యొక్క తర్జుమా నిజముగా "మచ్చ లేనిదిగా" లేదా "బలి పశువు మాదిరిగా లోపము లేనిది" అని అర్థము (లేవీయకాండము 22:21)."[16]

ఒక విధముగా చూచినట్లయితే మానవులు దేవుని వలె పరిశుద్ధులుగా ఏ మచ్చలేని వారుగా నిర్దొషమైన వారుగా ఉండ వీలుపడదు (1 యోహాను 1:8). క్రీస్తే మనకు పరిపూర్ణమైన మాదిరి మరియు క్రైస్తవులు ఆ మాదిరిని అందుకొనుటకు ముందుకు సాగాలి (1 పేతురు 2:21); కాని అందరు క్రీస్తులా ఉండు విషయములలో వెనుకబడి పోతున్నారు. అట్లని, పరిశుద్ధమును నిర్దోషమైన జీవితమును జీవించు ప్రయత్నమును రద్దు చేయదు. మనము వెలుగులో నడిచిన యెడల యేసు రక్తము ప్రతి పాపము నుండి మనలను పవిత్రులనుగా చేయును (1 యోహాను 1:7-9).

ఇంకొక ముఖ్యమైన విధముగా చూచినట్లయితే, క్రైస్తవుడు "క్రీస్తు నందు" ఉన్నాడు గనుక వారు పరిశుద్ధుడు, మరియు మచ్చలేనివాడు. "మనము ఆయన యెదుట పరిశుద్ధులమును, నిర్దోషులమునై యుండవలెనని" జగత్తు పునాది వేయబడక మునుపే "క్రీస్తు నందు" దేవుడు మనలను ఏర్పర్చుకొనెను. "ఉండవలెనని" (*einai hēmas*) భాషా ప్రయోగం "ఒక *సంకల్పమును* మరియు *నిర్మాణమును*" సూచిస్తున్నది.[17] ఇందును బట్టి క్రీస్తు నందు ఉన్న వారిని పరిశుద్ధులుగా, నిర్దోషులుగా ఉండుటకే దేవుడు ఏర్పరచుకొనెను అని అర్థమగుచున్నది. మన పాపములో మనము అపవిత్రులము, అవినీతిమంతులము, నశించినవారము. దేవుని దృష్టిలో మెచ్చుకొనుటకు మనవద్ద ఏమి లేదు. పాపములో జీవిస్తున్న వారు నీతిమంతులు కారు (రోమీయులకు 6:20). ధన్యతలలో, యేసు "ఆత్మ విషయమై దీనులైన వారిని" ధన్యులనెను, వారే తమ ఆత్మీయ పేదరికమును గుర్తించినవారు (మత్తయి 5:3).

"క్రీస్తు నందు" సమస్తము మారును. మనకు సొంత నీతి లేదు కాని, క్రీస్తే మన నీతి (1 కొరింథీయులకు 1:30). మనము సువార్తను అంగీకరించినప్పుడు మనము "నీతికి దాసులమైతిమి" (రోమీయులకు 6:17, 18). క్రీస్తు యొక్క వధువు, అనగా సంఘము తన వస్త్రములు క్రీస్తు రక్తములో కడుగుట వలన నీతిని ధరించుకొనెను (ప్రకటన 7:14; 19:8 చూడుము). మనము క్రీస్తులోనికి బాప్తిస్మము పొందుట వలన క్రీస్తును ధరించుకొని, ఆయన నీతిని ధరించుకొంటిమి (గలతీయులకు 3:27). మనము క్రీస్తులోనికి వచ్చినప్పుడు కరుణా సంపన్నుడైన దేవుడు తన నీతిని, పరిశుద్ధతను, నిర్దోషత్వమును ఆరోపింపజేసేను.

"ఆయన యెదుట" అను పదము *katenōpion autou* అను గ్రీకు పదము నుండి వచ్చి "లోపలికి చూడు" అని అర్థము నిచ్చును.[18] మనము దేవుని ముందు నిలుచున్నప్పుడు ఆయన మనలను సమస్త మానవ అసంపూర్ణతల ద్వారా మన ఆత్మను చూచి, "క్రీస్తు నందు" ఉన్న మన పరిశుద్ధత, నిర్దోషత్వమును చూచి సంతోషించును.

## ముందుగా నిర్ణయించబడుట (1:4-6)

**[4-6]ఎట్లనగా తన ప్రియునియందు తాను ఉచితముగా మనకనుగ్రహించిన తన కృపామహిమకుకీర్తి కలుగునట్లు, తన చిత్త ప్రకారమైన దయాసంకల్పముచొప్పున, యేసుక్రీస్తు ద్వారా తనకు కుమారులనుగా స్వీకరించుటకై, మనలను ముందుగా తన కోసము నిర్ణయించుకొని, ...**

**వచనము 4-6. ప్రేమలో** అనునది "ఆయన యెదుట" అనే దానితో చేర్చాలో లేదో లేక "ముందుగా నిర్ణయించుకొనెను"అను దానితో చేర్చాలో అను విషయములో పండితులు కొంత సంశయముతో ఉన్నారు. అది పూర్వోక్తముతో సంబంధము కలిగియున్న యెడల, "ఏర్పరచుకొను క్రియ మరియు దానికి చెందిన వారిని దృష్టిస్తుంది, అంటే మన పక్షాన పరిశుద్ధతను, నిర్దోషత్వమును, ఈ రెండు కూడ దేవుని ప్రేమ మరియు వారి వివరణ ఇందులో ఉన్నది."[19] ఏదియేమైనా, దేవుని నిర్ణయకార్యక్రమము దైవ ప్రేమచేత ప్రేరేపింపబడినదనేది నిజమే.

ఆర్. సి. హెచ్. లేన్స్కి ప్రేమలో అనే పదము 4వ వచనమునకు చెందినదని అంటాడు. అది మన ప్రేమను సూచిస్తుంది గనుక "పరిశుద్ధత మరియు నిర్దోషత్వము" అనునవి ప్రేమ చేత పురికొల్పబడి పరిశుద్ధుల గుణలక్షణాలను సూచిస్తుందని అంటాడు.[20] ఏదియేమైనా, "పరిశుద్ధత మరియు నిర్దోషత్వము" క్రీస్తునందున్న మన స్థితికి మరియు క్రీస్తు యేసునందు దేవుడు మనలనుచూసే దానికి సంబంధించినది. "ప్రేమలో" అనునది క్రైస్తవుల గుణమును కాదు గాని, అయితే మొదటిగా మనలను క్రీస్తునందు ఉంచుటకు అనుమతించిన దేవుని ప్రేమను వెల్లడి పరచుచున్నది. 4వ వచనంలోని "ప్రేమలో" అనే పదం దేవుడు మనలను ఆయన పిల్లలుగా ఉండుటకు ఎందుకు నిర్ణయించెనో వివరిస్తున్నదని మనము గ్రహించవలెను.

**ముందుగా నిర్ణయించబడుటకు** గ్రీకు పదము, *proorizō.* జగత్తు ఆరంభము కాక మునుపే, దేవుడు చరిత్రలో జరిగే విషయమును ముందుగా నిర్ణయించెను. **మనలను**

**దత్తపుత్రులుగా** (క్రీస్తు నందు పరిశుద్ధులు, విశ్వాసులుగా) స్వీకరించుటకు **ఆయన** చొరవ తీసుకొని, ముందుగా నిర్ణయించెను. క్రియ వాచకమైన *proorizō* ఐదు సార్లు పౌలు రచనలలో కనిపించును (రోమీయులకు 8:29, 30; 1 కొరింథీయులకు 2:7; ఎఫెసీయులకు 1:5, 11), మరియు అది ఎల్లప్పుడూ, "నిత్యత్వము నుండి దేవుడు నిర్ణంచువాడని సూచించుటకు ఉపయోగించబడినది, … లేక ఇక్కడ, ఏదో ఒకదానికి ఒకరిని ముందుగానే నియమించుటను సూచిస్తుంది."[21] "దత్తత" అనునది దేవుడు మనలను ముందుగానే నియమించిన గొప్ప ఆధిక్యతయైయున్నది. విశ్వాసులు, దేవుని పిల్లలు (లేక కుమారులు) అనునవి లేఖనములో దేవుడు తరచుగా ఉపయోగించినవే కాని, దత్తత అనునది పౌలు మాత్రమే వినియోగించెను. క్రొత్తనిబంధన గ్రీకులో దత్తత, *huiothesia* ఐదు సార్లు కనిపించును – ఒక సారి ఇశ్రాయేలుకు దేవునితో ఉన్న ప్రత్యేకమైన సంబంధమును గూర్చి (రోమీయులకు 9:4); మూడు సార్లు విశ్వాసుల ప్రస్తుత పరిస్థితిని గూర్చి (రోమీయులకు 8:15; గలతీయులకు 4:5; ఎఫెసీయులకు 1:5); మరియు ఇంకొక సారి క్రీస్తు రెండవ రాకడలో మృతుల పునరుత్థానమును గూర్చి, అనగా కుమారత్వము యొక్క సంపూర్ణత ప్రత్యక్షపరచు సందర్భము గూర్చి తెలుపుతుంది (రోమీయులకు 8:23).[22]

మూడు మినహాయించి, పాత నిబంధనలో దత్తతకు సంబంధించిన ఉదాహరణలు అరుదు. ఈ మూడు కూడా పాలస్తీనాకు వెలుపల జరిగినవి – మోషే (నిర్గమకాండము 2:10), గేనుబోతు (1 రాజులు 11:20) మరియు ఎస్తేరు (ఎస్తేరు 2:7, 15).[23] S. D. F. Salmond ఈ విధముగా గుర్తించాడు, "ఒక కుటుంబము నుండి ఒక బిడ్డను, జన్మించని వేరొక కుటుంబంలోనికి దత్తత తీసుకొనుటను యూదుల ధర్మశాస్త్రములో చట్టపరమైన పద్ధతి లేదు."[24]

గ్రీకుల మధ్య మరియు రోమీయుల మధ్య దత్తత స్వీకారం సాధారణమైన విషయమే:

> రోమా చట్టము క్రింద … *adoptio* అను వ్యవహారమునకు అవకాశము కలదు. తనకు జన్మించని ఒక బిడ్డను తన బిడ్డగా స్వీకరించుటకు అనుమతి కలదు. మరియు *arrogatio* అను పదము మరణము సంభవించగా అనాదలైన వారిని కూడా వేరు విధముగా తమ ఇంట చేర్చుకొను పద్ధతిని సూచిస్తుంది. ఒక రోమీయుడు తనకు పుట్టని వారిని కొంత మంది సాక్షులతో తన యింట చేర్చుకొని అతనికి పేరు పెట్టవచ్చు. అలా దత్తత తీసుకోబడిన వానికి పుట్టిన బిడ్డకు కలిగిన సర్వ హక్కులు మరియు బాధ్యతలు ఉండును.[25]

రోమా మరియు గ్రీకుల చట్టము ప్రకారము దత్తత తీసుకోబడిన వారు దాసుని వలె ఆ తండ్రికి ఆస్తిగా ఉందురు. దత్తత కుటుంబానికి అతను కుమారునిగాను తన గత కుటుంబమునకు మరణించినవాని వలే ఉండును.[26] పౌలు పరిశుద్ధాత్మ వలన నడిపింపబడి, ఆ సందర్భములో ఉన్న చట్టములను, ఆచారములను చూసి ఎఫెసీయులకు దేవునితో ఉన్న సంబంధమును దత్తత భావమును తెలియజేస్తూ వివరించెను.

దేవుడు మనలను "దత్తపుత్రులుగా" ఉండవలెనని ముందుగా నిర్ణయించెనని పౌలు చెప్పెను. *eis*, "to" అనే ఆంగ్లములోని ఉపసర్గం మరియు "దృష్టితో"[27] అనునవి దేవుని నిర్ణయములోని ఉద్దేశమును సూచిస్తున్నది. ఈ విధముగా, "యేసు క్రీస్తు నందున్న విశ్వాసులు … మరియు పరిశుద్ధులు" "ఏర్పర్చబడినవారైనారు" మరియు "యేసు క్రీస్తు

ద్వార కుమారులై" ఉండుటకు నిర్ణయించబడిరి. కెన్నెత్ ఎస్. యుస్ట్, గ్రీకు నామవాచకము *huiothesia*, అనునది *tithēmi* ("ఉంచుట") మరియు *huios* ("వయస్సు వచ్చిన కుమారుడు") నుండి వచ్చిందని గ్రీకు భావమును ఈ విధముగా చెప్పెను: దేవుడు పెద్ద వారైన కుమారులను, వారికి చట్ట పరమైన భద్రత కల్పించునట్లు వారిని కుమారులుగా (వారి అవసరాలు తీర్చుతూ) వారికి కుమారునికి గల సామాజిక హక్కులను (స్వాస్థ్యమును) అనుగ్రహించెను.[28]

ఇంకా కొన్ని లేఖన భాగములు ఈ దత్తత విషయమై కొంత సమాచారమును జోడించును. (1) గలతీయులకు 4:4-7లో, పౌలు ధర్మశాస్త్రమునకు బానిసలుగా ఉన్న వారిని (దానిని పాటించ లేనివారిని) ప్రస్తావిస్తూ దత్తత గూర్చి మాట్లడెను. ఇందులో దత్తతను బానిసత్వము నుండి విడుదలకు సూచనగా వివరించెను. "విమోచన" *exagorazō* అనునది, "దాసులను సంతలో కొనుట"[29] అని అర్థం. ఈ వచన భాగము ఇంకా ఆ విమోచన క్రీస్తు మరణము ద్వార పాపపు బానిసత్వములో ఉన్న వారిని మూల్యమును చెల్లించి విడిపించుటను వివరిస్తుంది (యోహాను 8:34; రోమీయులకు 6:17, 18; 1 పేతురు 1:18, 19 చూడు). (2) దాస్యములో ఉన్న మానవ స్వభావమును విముక్తి చేసే దానిని రోమీయులకు 8:15 తెలియజేయుచున్నది. విమోచన పొందిన వారు దేవుని వారసులు మరియు క్రీస్తుతో కూడా సమాన వారసులు. ఒక దినాన సమాన వారసులందరూ ఆయనతో మహిమ పరచబడుదురు. (3) రోమీయులకు 8:23లో, దత్తత అనునది మరణము నుండి తిరిగి లేచుటను గూర్చి వివరించు చున్నది. ముందుగా నిర్ణయించెను అని పౌలు మాట్లాడినది మనము దేవుని పిల్లలుగా పొందు ఆశీర్వాదములను గూర్చి మాట్లాడెను. దేవుని కుటుంబములోనికి దత్తత తీసుకొనబడిన వారిని దేవుడు తన కుమారుని సారూప్యములోకి రూపాంతరము చెందుటకైన గొప్ప గురి యొద్దకు పిలిచెను (రోమీయులకు 8:29).

దత్తత అను భావము, మనము పాపమునకు దాసులమైయుండగా, క్రీస్తు రక్తము ద్వారా మనలను దాసుల సంతలో నుండి బయటికి తెచ్చాడని జ్ఞాపకము చేయుచున్నది. ఇదివరకు మనమున్న యజమానికి లేక తలిదండ్రులకు మనం మృతులమైతిమి (రోమీయులకు 6:1-4 చూడుము) మరియు ఇప్పుడు మనము నీతికి దాసులము (రోమీయులకు 6:17, 18). "దేవుని వారసులుగా, క్రీస్తుతో సమాన వారసులుగా" దేవుని అద్వితీయ కుమారుడైన యేసు యొక్క సమాన హక్కులను మరియు బాధ్యతలను పంచుకొనియున్నాము (రోమీయులకు 8:17).

క్రీస్తులో ఉన్న వారిని దేవుడు తనకు కుమారులనుగా **యేసుక్రీస్తు ద్వారా** చేసెను. "ద్వారా" (*dia*) అనునది, క్రీస్తు యొక్క "మధ్యవర్థిత్వమును" సూచిస్తున్నది.[30] సిలువలో క్రీస్తు బలి ద్వార దేవుని కుటుంబములోనికి పాపులను దత్త తీసుకొనుట అను ఉద్దేశము నెరవేరెను (గలతీయులకు 4:4-7 చూడుము).

**తనకొరకు** అనునది, క్రీస్తునందు ఉన్న వారిని తన వారిగా చేసుకొనుటకు ముందుగా నిర్ణయించిన దేవుని సూచిస్తుంది.

> మనము ఆయన ప్రయోజన కుమారులుగా ఉండుటకు, ఆయన సంతోషము కొరకు, ఆయన కుమారులైన వారిపై తన దివ్యమైన ప్రేమను కుమ్మరించుటకు ఆయనతో సహవాసమును

కుమారత్వము యొక్క అత్యధికమైన ఆధిక్యతను యిచ్చుటకును ఆయన మనలను రక్షించుట ద్వారా మరియు మన ఆరాధనలను సేవలను స్వీకరించుటకు మనలను దేవుడు ముందుగానే గుర్తించాడు.[31]

"కొరకు" అనే *eis* పదము దేవుడు చేసిన సమస్తము ఆయన కొరకేనన్న లక్ష్యాన్ని సూచిస్తుంది.[32]

**వచనము 5. తన చిత్తప్రకారమైన దయాసంకల్పము చొప్పున** అని ఈ వచనము కొనసాగుతుంది. కొన్ని NASB ముద్రణలోఉపాంత సూచనలో "దయా సంకల్పము" అను దానిని "ప్రియమైన ఇష్టము" అని భాషాంతరం చేశారు (NKJVని చూడు). NEBలో "ఆయన చిత్తము మరియు ఇష్టము" చొప్పున అని మరియు NIVలో "తన చిత్త ప్రకారమైన ఇష్టము చొప్పున" అని తర్జుమ చేయబడింది. LBలో "ఆయన కావాలని అనుకొనందున" అని ఉంది. "ఇష్టము" *(eudokia)* అనేది సువార్తలలో మూడు సార్లు కనిపిస్తుంది (మత్తయి 11:26; లూకా 2:14; 10:21), ఆరుసార్లు పౌలు పత్రికలలో (రోమీయులకు 10:1; ఎఫెసీయులకు 1:5, 9; ఫిలిప్పీయులకు 1:15, 2:13; 2 థెస్సలొనీకయులకు 1:11) కనిపించును.[33] మార్విన్ ఆర్. విన్సెంట్ దీనిని గూర్చి, "*దయతో లేక స్నేహభావముతో* కూడినది కాదు [లూకా 2:14 మరియు ఫిలిప్పీయులకు 1:15లో వలే], *అయితే ఆయనకు ప్రియమైనందున* [చూడు మత్తయి 11:26 మరియు లూకా 10:21]. మరొక మాటలో, ఏదియేమైనా, చేర్చబడి మరియు ఇమిడియున్న అర్థంలో, మరియు *ప్రేమలో* వివరించబడియున్నది."[34] ("చొప్పున" అనే దాని గూర్చిన మరికొన్ని వివరాలను 1:7, 9 పై వ్యాఖ్యానములను చూడు.)

**వచనము 6. తన కృపా మహిమకు కీర్తి కలుగునట్లు.** ఈ మాటలు పౌలు దేవునికి మహిమపరచే విధముగా చెప్పిన మాటలవలె ఉన్నవి (1:12, 14), కాని, ఇక్కడ ప్రధాన విషయము దేవుని కృప. "కు" (*eis*) అనునది, "క్రీస్తు నందు" దేవుడు మానవులకు చేసిన కార్యమునకు *ఫలమును* చూపుచున్నది. దేవుని కృపయందు ఆయన లక్షణములు మరియు ఆయన పని చేర్చ బడియున్నాయి. కావున, ఆయన కృపామహిమ, ఆయన యొక్క వైభవం, మరియు తన ప్రజల నుండి స్తుతి ఆరాధన కొరకైన ప్రకాశమానమైన ఆయన సంకల్పంలోని పిలుపు. దేవుని నిత్యసంకల్పం దేవున్ని స్తుతించుటకు పురికొల్పును.

దేవుని కృపను గూర్చిన చర్చను **తాను ఉచితముగా మనకనుగ్రహించిన** అను మాటలతో కొనసాగించాడు. ఆయన ఈ కృపను మనకు "ఉచితముగా అనుగ్రహించెను." కొన్ని అనువాదాలలో, ఆయన "మనలను అంగీకరించేలా చేసెను" (NKJV) అని ఉంది. దేవుడు కృప. కృపను బట్టి అయన మనలను అనుసరించి, ఆయన కృపతో నింపి, ఆయన కృపను బట్టే మనలను ఆశీర్వదించెను, మనం అంతమువరకు ఆయనను కీర్తించేలా చేసెను.

**తన ప్రియుని యందు** అనునది, క్రీస్తును సూచిస్తూ ఆలోచనను కొనసాగించెను. యేసు దేవుని "ప్రియమైన కుమారునిగా" వర్ణించబడెను (మత్తయి 3:17; 17:5; కొలొస్సయులకు 1:13). ఆంద్రూ టి. లింకన్, యేసు "అతి శ్రేష్ఠమైన ప్రియ కుమారుడు" అని వర్ణించెను.[35] దేవుడు పాపుల నిమిత్తము క్రీస్తునందు మరియు క్రీస్తు ద్వారా చేసిన సమస్తము ఆయన పాపములను చూసి చూడనట్లు ఉండుట వలన కాదు. దేవుడు సంపూర్ణమైన కృప, దయ, ప్రేమా సంపన్నుడైయినను, ఆయన న్యాయవంతుడు మరియు పరిశుద్ధుడు. కనుక, పాపము

తీర్పు పొందవలయును, మరియు ఆయన దానిని సిలువ వద్ద జరిగించెను. దేవుడు పాపుల యెడల కనికరమును చూపునప్పుడు "క్రీస్తునందు" ఉన్న ప్రతివారు దేవుని న్యాయము మరియు పరిశుద్ధతలో పాలుపొందుదురు (రోమీయులకు 3:23-26). క్రీస్తు నందున్న వారికి "అనుగ్రహింపబడిన" కృపను గ్రీకులోని పదం[36] గతములో చేసిన పాపముల కొరకు పాపుల నిమిత్తం ఒక్క సారే అర్పింపబడిన సమస్తమునకు చాలిన క్రీస్తు అర్పణను సూచిస్తుంది (హెబ్రీయులకు 10:12).

## విమోచింపబడుట (1:7)

**[7]... ఆ ప్రియునియందు ఆయన రక్తమువలన మనకు విమోచనము, ...**

క్రైస్తవులు దేవుని ద్వారా పరిశుద్ధులు, నిర్దోషులుగా ఉండుటకు ఏర్పరచుకొనిన వారని చెప్పిన తరువాత, పౌలు ఆ స్థితి ఎలాగు సాధ్యపడినదో వివరించెను. దత్తత తీసుకొనబడిన కుమారులు క్రీస్తు మరణము ద్వారా విమోచింపబడ్డారు మరియు వారి పాపములు క్షమింపబడ్డాయి. 1:3-14 వరకు వివరింపబడిన రెండు ఆత్మ సంబంధమైన ఆశీర్వాదములివి.

**వచనము 7.** పౌలు సహోదరులకు క్రీస్తునందు ఉన్న మూడవ ఆశీర్వాదమును గుర్తు చేసెను: **ఆ ప్రియుని యందు ఆయన రక్తము వలన మనకు విమోచనము**. "విమోచనము" అను పదమునకు గొప్ప చారిత్రక ప్రాముఖ్యత కలదు మరియు అది దేవునితో ఉన్న మన సంబంధమును వివరించును. అనిర్దిష్ట కాలమునకు (aorist tense) బదులుగా (గతములో జరిగిన దానిని మాట్లాడుట), పౌలు వర్తమాన కాలమును ఉపయోగించాడు (మాట్లాడు వారు చేసిన ప్రతిపాదన సమయములో జరిగిన దానిని సూచిస్తుంది).[37] ఆయన మాట్లాడిన ఆశీర్వాదములు గతములో జరిగినది. అయితే ప్రస్తుత మరియు భవిష్యత్తు మేలును యిచ్చును. క్రీస్తుయేసు నందున్న వారు యిప్పుడు, వర్తమాన కాలంలో, విమోచన యొక్క ఫలితములను కలిగియున్నారు. ఆత్మ సంబంధమైన ప్రతి ఆశీర్వాదము క్రీస్తునందు అనుగ్రహింపబడును, గనుక "ఆయన యందు" మనకు "విమోచన."

"విమోచనము" అనునది పాత నిబంధన సంబంధమైన ఆలోచన. లేఖనములు ఐగుప్తు చెర నుండి ఇశ్రాయేలీయుల విముక్తిని "విమోచనముగా" వర్ణించెను (నిర్గమకాండము 6:6; 15:13; ద్వితీయోపదేశకాండము 7:8; 15:15). ఈ నూతన నిబంధన సూత్రమును బోధించునప్పుడు పౌలుకు ఆ పాతనిబంధన సందర్భము మనస్సులో ఉండి ఉండవచ్చు. "విమోచనము" *apolutrōsis* అనగా "చెర నుండి విడుదల." ప్రాచీన విధానములో అది క్రయధనమునిచ్చి "'బానిసను తిరిగి కొనుట'[38] అంటే, క్రయధనమిచ్చి 'విడిపించుట'" అను అర్థమును ఇచ్చును. గ్రీకులో "విమోచన" అను పదముతో గ్రీకులో ఉపపదమును కలిగియుంది మరియు అవి అక్షరార్థముగా, "ఆ విమోచన" అని చదువబడింది, అంటే, విమోచన ఎదురుచూచినట్లు మరియు ఆశించినట్లు మరియు యిప్పుడు అనుభవించబడినది. ఈ వాక్యా భాగమును వ్రాయుటలో పౌలుకు "విముక్తి" మరియు "క్రయధనము" మనస్సులో ఉండి ఉండవచ్చు. "విమోచన" గూర్చి మాట్లాడునప్పుడు "ఆయన రక్తం ద్వారా" అని చేర్చాడు.

క్రీస్తు రక్తమే పాపిని విడిపించుటకు చెల్లించిన క్రయధనము. అందు నిమిత్తమే, పౌలు "మీరు విలువ పెట్టి కొనబడినవారు" అని అన్నాడు (1 కొరింథీయులకు 6:20). పేతురు కూడా, "మీరు అమూల్యమైన రక్తము చేత విమోచింపబడ్డారు … అనగా క్రీస్తు రక్తము చేత" (1 పేతురు 1:18, 19). విమోచనమునకు క్రీస్తు రక్తము ఎందుకు కావలసి వచ్చెను? పాత నిబంధన బలులను గూర్చి వివరించిన అంతర్ దృష్టితో కూడిన ప్రతిపాదనలు లేవీయకాండం 17:11లో ఉన్నాయి. ఆ తర్వాత అక్కడ "రక్తము దేహమునకు ప్రాణము … రక్తము దానిలోనున్న ప్రాణమునుబట్టి ప్రాయశ్చిత్తము చేయును" అని మోషే వివరించాడు. ప్రాచీన ఇశ్రాయేలీయుల యొక్క పాపము యెడల ఉన్న దేవుని ఉగ్రతను తాత్కలికంగా శాంతి పర్చుటకు రక్తంతో కూడిన జంతుబలులను అర్పించినట్లుగానే పాపమునుబట్టి నష్టపోయిన జీవితములకు న్యాయమును మరియు శాశ్వతమైన దేవుని ఉగ్రతకు శాంతిని తెచ్చుటకు క్రీస్తు తన జీవితమును అర్పించాడు. "క్రీస్తు రక్తము ద్వారా" అనే వాక్యంలో *dia* అను ఉపసర్గము పాపం యొక్క క్రయధనమును క్రీస్తురక్తం ద్వారా చెల్లించిన దానిని తెలియజేయుచున్నది. దేవుని పరిశుద్ధమైన చట్టము ప్రకారము, "పాపముల వలన వచ్చు జీతము మరణము" (రోమీయులకు 6:23); కాని మన విమోచనము కొరకు క్రీస్తు తన రక్తము ద్వార చెల్లించెను.

## క్షమింపబడుట (1:7, 8)

**7దేవుని కృపామహదైశ్వర్యమునుబట్టి … మన అపరాధములకు క్షమాపణ మనకు కలిగియున్నది. 8… ఆ కృపను మనయెడల విస్తరింపజేసెను.**

**వచనము 7.** "ఆయన రక్తము ద్వారా మనకు విమోచనము" (1:7) మరియు "మన అపరాధములకు క్షమాపణ" (1:7) అని వ్రాసినప్పుడు రెండు విషయములు ఆయన మనస్సులో ఉన్నవి. "విమోచనము" సిలువలో క్రీస్తు రక్తము క్రయధనముగా చెల్లించినప్పుడు జరిగినది; "పాపక్షమాపణ" ఒక పాపి క్రీస్తులోనికి బాప్తిస్మము పొంది, "క్రీస్తు లోనికి" చేర్చబడినప్పుడు జరుగుతుంది (అపొస్తలుల కార్యములు 2:38).

**క్షమాపణ** అనునది నాలుగవ ఆత్మ సంబంధమైన ఆశీర్వాదము. యిక్కడ గ్రీకులో వాడిన *aphesis* అను నామవాచకం, *aphiēni* అను క్రియాపదము నుండి వచ్చింది, అంటే "పంపి వేయుట" అను అర్థము నిచ్చునది.[39] ఇప్పుడు మనము ధర్మశాస్త్రము ప్రకారము ఇశ్రాయేలు పాపములను మోయుచు "… పంపి" వేయు మేకను జ్ఞాపకము చేయుచున్నది (లేవీయకాండము 16:21). కీర్తనలోను ఈ విధమైన పంపివేసేడు ఆలోచన కనబడును. దావీదు ఈ విధముగా వ్రాసెను, "పడమటికి తూర్పు ఎంతదూరమో ఆయన మన అతిక్రమములను మనకు అంత దూరముగా" చేసెను (కీర్తనలు 103:12). మీకా ఈ విధముగా చెప్పెను, "… వారి పాపములన్నిటిని సముద్రపు అగాధములలో నీవు పడవేతువు" (మీకా 7:19). యెషయా దేవుని గూర్చి మాటలాడి ఈ విషయమునే గ్రహించెను, "నేను నేనే నా చిత్తానుసారముగా నీ యతిక్రమములను తుడిచివేయుచున్నాను నేను నీ పాపములను జ్ఞాపకము చేసికొనను" (యెషయా 43:25). యేసు కూడా విమోచనము మరియు క్షమాపణలను కలిపి బోధించెను. ఆయన ఇట్లనెను, "ఆలాగే మనుష్య కుమారుడు

పరిచారము చేయించు కొనుటకు రాలేదు గాని పరిచారము చేయుటకును అనేకులకు ప్రతిగా విమోచనా క్రయధనముగా తన ప్రాణమును నిచ్చుటకు వచ్చెను అని చెప్పెను" (మత్తయి 20:28); "ఇది నా రక్తము అనగా పాపక్షమాపణ నిమిత్తము అనేకుల కొరకు చిందింపబడుచున్న నిబంధన రక్తము" (మత్తయి 26:28).

**అపరాధములు** అనునది *paraptōma* నుండి వచ్చింది, అది పాపమును "నైతిక విలువలను అతిక్రమించుటగా" వివరిస్తుంది. మరియు అది "వెనుకబడుట" లేదా, "ప్రక్కకు *తొలగుట*" అను అర్థము నిచ్చును.[40] క్రొత్త నిబంధన పదములైన *anomia* ("ఆజ్ఞాతిక్రమము") మరియు *adikia* ("దుర్నీతి") పాపమును వివరిస్తున్నాయి. క్రొత్తనిబంధనలో పాపమునకు కనిపించు సామాన్య గ్రీకు పదము *hamartia*, ఇది "ఒక క్రియ మాత్రమే కాక ఒక బలమైన *శక్తిగా*, ఒక *అలవాటుగా*, ఒక *స్థితిగా*" వర్ణింపబడెను.[41] ఎవరైనా అపరాధములో నిలిచియుంటె, అతిక్రమించిన జీవితాన్ని జీవిస్తునట్టే మరియు పాపము యొక్క అధికారము క్రింద జీవిస్తున్నట్లే. ఒకరు క్రీస్తులోనికి ప్రవేశించినప్పుడు దేవుని కృప వారి అపరాధములను, అతిక్రమములను దేవుడు క్షమించి వారిని నీతిమంతులుగా తీర్చును. అతడు పాపము యొక్క బలం, దోషం, మరియు పర్యవసానముల నుండి విడుదల పొందును; అతనిని సన్మార్గమున నడిపించి, రూపాంతరము చెందిన జీవితమును జీవించునట్టు దేవుని కృప బలపరుచును.

**వచనము 7. బట్టి** (*kata*) అనునది గ్రీకులో "ఆధిపత్యము" అనే భావమును కలిగి నియంత్రనను గూర్చి మాట్లాడుతుంది.[42] దేవుని విమోచనమును మరియు క్షమాపణను ఆయన **కృపామహదైశ్వర్యము**చే (*ploutos*) నియంత్రించబడుచున్నాయి – అంటే ఐశ్వర్యం లేక సమృద్ధిగల – **ఆయన కృప**[43] (చూడు 1:6).

> *ఉచితముగా* లభించు ఈ దైవీకమైన దయ, కృప రూపములో, *ఎన్నికలేని* దైవీకమైన మంచితనము యొక్క స్వభావమును, పౌలు దేవుని కీర్తించుచూ మహిమపరచెను. ఆయన *ఐశ్వర్యములు* తన కృప ద్వారా పరిచయము చేయబడెను. ఈ అద్భుతమైన ఐశ్వర్యముతో కూడిన *కృపామహదైశ్వర్యము* క్రీస్తునందు దేవుడు మనకు అనుగ్రహించెను అనేది పౌలు పత్రికలకు ఉన్న విశిష్టతయైయున్నది.[44]

క్రీస్తు యొక్క సిలువను చూసినట్లయితే దేవుని కృప యొక్క ఐశ్వర్యమును గ్రహించుటకు క్రైస్తవులకు సాధ్యపడును. తన సొంత కుమారుని మరణం ద్వారా అయోగ్యులైన మానవాళికి విమోచన, క్షమాపణ అనుగ్రహించునట్టు సిలువ యొద్దనే అనుమతించాడు. దేవుని కృపకు అంతము లేదు, దాని వనరులకు కొరత లేదు, అది మానవ అవసరాలకు కొరత కానిది. ఈ విధముగా పౌలు రోమీయులకు 5:20లో చెప్పెను: "పాపమెక్కడ విస్తరించెనో, అక్కడ కృప అపరిమితముగా విస్తరించెను." దేవుని కృప తరిగిపోనిది (చూడు 2:7)!

**వచనము 8. ఆ** (*hos*, which) ఆ అనునది దేవుని కృపను సూచిస్తున్నది. పౌలు ఆ కృప **మనయెడల విస్తరింపజేసెను** అని చెప్పెను. "విస్తరింపజేసెను" అను దాని గ్రీకు పదము *perisseuō* అనగా "సమృద్ధిగా, పర్యాప్తంగా" అని అర్థము. ఇంకొక విధముగా దానిని చూచినట్లయితే అది "విస్తరించునట్లు"[45] చేయబడినది. పౌలు ఏమి అంటున్నాడంటె, దేవుని కృప మన సమస్త అవసరతలకు చాలినది.

## జ్ఞానవివేచన కలుగుటకు (1:8-10)

**[8-9]... ఆయన తన దయాసంకల్పముచొప్పున తన చిత్తమునుగూర్చిన మర్మమును మనకు తెలియజేసి, మనకు సంపూర్ణమైన జ్ఞానవివేచన కలుగుటకు, ... [10]ఈ సంకల్పమునుబట్టి ఆయన పరలోకములో ఉన్నవేగాని, భూమిమీద ఉన్నవేగాని, సమస్తమును క్రీస్తునందు ఏకముగా సమకూర్చవలెనని తనలోతాను నిర్ణయించుకొనెను.**

పౌలు పేర్కొనిన ఐదవ ఆత్మ సంబంధమైన ఆశీర్వాదములు దేవుని కృప వలన అపరిమితముగా విస్తరింపచేయబడినదే (1:8). "మనకు సంపూర్ణమైన జ్ఞానవివేచన కలుగుటకు తన చిత్తమును గూర్చిన మర్మమును మనకు తెలియజేసెను" (1:8, 9). దేవుడు తన హృదయమును మనకు బయలుపరచెను!

**వచనములు 8, 9. మనకు సంపూర్ణమైన జ్ఞానవివేచన కలుగుటకు** అనునది **ఆయన తెలియజేసెను** అను పదమునకు అర్హత నిచ్చును. జ్ఞానము వివేచనలు దేవునివా లేక అవి మానవులకు దేవుడు అందించినవా అనే విషయముపై వ్యాఖ్యాన కర్తలు సందిగ్ధములో ఉన్నారు, కాని పౌలు కొలొస్సయుల కొరకు చేసిన ప్రార్థన ఎఫెసీలోని ఈ వాక్యభాగముతో సమానముగా ఉంది. దేవుడు వారు ఆయన చిత్తము యొక్క జ్ఞానమును ఎరుగుటకు వారికి జ్ఞానము, వివేచనను అనుగ్రహించునని చూచిస్తుంది (కొలొస్సయులకు 1:9). వేరే విధముగా చెప్పాలంటే, దేవుడు ఆయన చిత్తమును అనుగ్రహించి దానిని గ్రహించుటకు మరియు అన్వయించుకొనుటకు సామర్థ్యమును, మనకు దయచేయును.

"జ్ఞానమునకు" గ్రీకు పదము (*sophia*) ఇది క్రొత్త నిబంధన గ్రంథ కర్తలైన పౌలు మరియు ఇతరులు దీనిని విరివిగా వాడిరి. "వివేచనకు" గ్రీకు పదము (*phronēsis*) ఇది ఇక్కడ కాక మరి ఇంకొక సారి మాత్రమే క్రొత్తనిబంధనలో కనిపించును (లూకా 1:17, ఇక్కడ నీతిమంతుల దృక్పథమును గూర్చి మాట్లాడెను). ప్లేటో, అరిస్టాటిల్, ఫైలో, మరియు సిసురో అను బైబిలుకు వెలుపల ఉన్న గ్రంథ కర్తలు, ఈ రెండు పదములకు వ్యత్యాసమును చూపిరి. "జ్ఞానము" అనునది సాధారణముగా ఒక విశాలమైన ఆలోచనను వెల్లడిపరచినది. మరియు "వివేచన" ఆ జ్ఞానమును ఆచరణలో పెట్టుటవలన కలుగు ఫలితమును వివరించునది.[46] ఇది క్రొత్తనిబంధన విషయములో కూడా సత్యమే అని తెలుస్తుంది. "జ్ఞానము" అనునది తెలివిగా దేవుని విషయములను గ్రహించుట, మరియు "వివేచన" అనునది ఆ జ్ఞానమును అనుదిన జీవితమునకు అన్వయించుకొను దానిని సూచిస్తుంది. నిజమైన మత జ్ఞానము మరియు వివేచన దేవుని సమృద్ధియైన కృపవరముగా వచ్చును. పౌలు మాటలాడు ఈ "జ్ఞానము" మరియు "వివేచన" "దేవుని చిత్తానుసారమైన మర్మమును" అన్వయించుటకు మనకిచ్చు సామర్థ్యమును సూచించుచున్నది.

**మర్మము** *mustērion* నుండి తర్జుమా చేయబడినది. ఇది ఎఫెసీ పత్రికలో 6 సార్లు కనిపించును. ఈ రోజున మనము ఆలోచన చేయునట్టి రహస్యము కాదు కాని, అది ఒక దైవికమైన సత్యము యొక్క బయలుపడుటను సూచిస్తున్నది.[47] ఇక్కడ వాడిన మాదిరిగా, అది సువార్తను సూచిస్తున్నది (చూడు 6:19), అదే క్రీస్తు మరణము మరియు పునరుత్థానము ద్వారా, మానవులను రక్షించు దేవుని ఉద్దేశమైయున్నది. 1 కొరింథీయులకు 2:7-13లో పౌలు దేవుని మర్మమును గూర్చి విపులముగా చర్చించెను.

పౌలు మానవుని మహిమ నిమిత్తమై దేవునిచే నిర్ణయించబడిన మరియు పూర్వకాలము నుండి మరుగుచేయబడిన మర్మమును గూర్చిన జ్ఞానమును లేక పథకమును మాట్లాడెనని చెప్పాడు (7 వచనము). పూర్వపు అపొస్తలులకు బయలుపరచినట్టుగా ఏ మనుష్యునికి దేవుని సంకల్పం బయలుపరచబడలేదు. దేవుడే బయలుపరచునంత వరకు ఏ మానవుడు దానిని గూర్చి ఆలోచించుట కాని, యోచించుట కాని చేయలేదు (8-10 వచనములు). దేవుని సమయములోనే, అది ఆయన ఏర్పరచుకొనిన వారికి మాత్రమే "ఆత్మ ద్వారా" బయలుపరచెను (10 వచనము). "మనుష్యజ్ఞానము నేర్పుమాటలతో గాక ఆత్మ సంబంధమైన సంగతులను ఆత్మ సంబంధమైన సంగతులతో సరిచూచుచు, ఆత్మ నేర్పుమాటలతో వీటిని గూర్చియే మేము బోధించుచున్నాము." అని చెప్పి, పౌలు దేవుడు ఎర్పరచుకొనిన వారిలో ఒకడని తనను గూర్చి చెప్పెను (13 వచనము).

కాలములకు సంబంధించి, దేవుని ప్రణాళిక ఒక మర్మము; అది బయలుపరచునంత కాలము అది మరుగు చేయబడి, లేక దాచబడి యుండెను. ఇప్పుడు బయలుపరచబడినది, దేవుని సంపూర్ణమైన దైవిక రక్షణ ప్రణాళికతో కూడినదై యున్నది (చూడు రోమీయులకు 16:25; 1 కొరింథీయులకు 2:7; ఎఫెసీయులకు 6:19; కొలొస్సయులకు 1:26; 1 తిమోతి 3:9, 16), మరియు ఇంకా కొన్ని నిర్దిష్టమైన విషయములతో కూడిన ప్రణాళిక. ఉదాహరణకు, దేవుడు యూదులు మరియు అన్యులు రక్షణకు యోగ్యులని బయలుపరచెను (రోమీయులకు 11:25; ఎఫెసీయులకు 3:3, 6). ఆయన మృతుల పునరుత్థానమును గూర్చి మరియు జీవించువారు రెండవ రాకడలో మార్పు చెందే విధమును వివరించెను (1 కొరింథీయులకు 15:51, 52). మరియు సంఘమునకు క్రీస్తుకు మధ్య ఉన్న సంబంధమును వివరించెను (ఎఫెసీయులకు 5:32). పౌలు **(దేవుని) తన చిత్తానుసారమైన** మర్మమును గూర్చి మాటలాడెను. "చిత్తము" *thelēma* అను గ్రీకు పదమునుండి వచ్చి, ("భావోద్వేగములతో కూడిన కోరికను చూపుచున్నది")[48] మరియు దేవుని చిత్తము ఆయన ప్రేమా హృదయము నుండి వచ్చును.

**చొప్పున/బట్టి** అనునది గ్రీకులోని ఉపసర్గమైన *kata* నుండి తర్జుమా చేయబడినది, ఇది ఐదు సార్లు ఎఫెసీ పత్రికలోని ఈ భాగములో కనిపించును (1:5, 7, 9, 11 [రెండు సార్లు]) మరియు అది "ఎక్కడి నుండో వచ్చినట్లు"[49] సూచిస్తున్నది. మరియు దేవుని చిత్తమును బయలుపరుచుటకు ఆయన **దయాసంకల్పము** (*eudokia* నుండి, చిత్తము) యొక్క గురియైయున్నదని పౌలు ధ్రువీకరించెను.[50] దేవుడు సువార్తయందు దేనిని బయలుపరచాడో అది తన ప్రియమైన చిత్తము బట్టి పరిశుద్ధుల మేలుకొరకు వెల్లడిపరిచాడు (చూడు 1:5). ఈ దయపూర్వక **సంకల్పమే** *(protithēmi*, "తనయెదుట తాను ఉంచుకొనునది," అంటే, "సంకల్పించుట"[51]). ఆ సంకల్పము ఆయన సొంత ఆలోచన చొప్పున తన హృదయమునుండి వచ్చినది. **తనయందు** అనునది, క్రీస్తుకు చెందినది, మరియు క్రీస్తునందు అనుభవించే ఆశీర్వాదములను గూర్చి ఈ భాగములో వివరించబడెను. అయినను దానిని మనము "తనయందు" (NKJV) *en autōi* అని తర్జుమా చేయుట మంచిది. ఎందుకనిన, ఈ సందర్భములో దేవుని గూర్చిన ప్రస్తావన ఉన్నది కాని క్రీస్తును గూర్చి ప్రస్తావన తరువాత వచనము వరకురాదు (2 తిమోతి 1:9).

**జరుగవలసిన యేర్పటునుబట్టి** అనునది *eis* అను పదమునకు మంచి తర్జుమా

ఎందుకనగా, దేవుని ఉద్దేశము యొక్క దిశను మరియు దాని యేర్పటును గూర్చి పౌలు ప్రకటించబోతున్నాడు. **నిర్వాహణ** అనునది గ్రీకులోని *oikonomia oikos* ("యిల్లు") మరియు *nomos* ("చట్టము") అను పదబంధము నుండి వచ్చింది. "యింటిని నిర్వాహించుట, లేక యింటి వ్యవహారాలు, నిర్వాహణ, పర్యవేక్షణ, ఆస్తి నిర్వాహణ, నిర్వాహుని కార్యాలయము, అధ్యక్షుడు, గృహనిర్వాహకత్వం"[52] అని అర్థం. లింకన్ *oikonomia* పదమును నిర్వాహక క్రియను, నిర్వహించు దానిని, లేక నిర్వహించు వాని పాత్రను సూచిస్తుంది అని అన్నాడు. అయితే గ్రీకు ప్రపంచంలో అది "దేవుడు విశ్వాన్ని నిర్వహించుట మరియు దేవుని ఆదేశమునకు తరుచుగా ఉపయోగించబడింది."[53]

ఇక్కడ దేవుడే గృహనిర్వాహకుడను అను అర్థం ఉంది: ఆయన నిర్వహించువాడు, నిర్వహించబడినది ఆయన సంకల్పం, మర్మమిప్పుడు బయలుపరచబడింది. NASBలో "of" అను సామాన్యమైన గ్రీకు పదమును **అనుకూలమైన** అని తర్జుమా చేసింది. అయితే కొన్ని తర్జుమాలలో సూచనలలో పొందుపర్చారు. ఆ తర్జుమా సరియైన అర్థమును ఇచ్చును, ఏలయనగా "కాలము సంపూర్ణమైనప్పుడు" అను దానికి అది నడిపించును, దానిని నిర్వహించు వాడు దేవుడే. క్రీస్తు ఇప్పుడు బయలుపరచబడిన మర్మముతో సంపూర్ణముగా ఇమిడి ఉన్నాడు. ఆయన దేవుని ప్రణాళికకు కేంద్ర బిందువు మరియు కారకుడు. కొలొస్సయులకు 1:27లో "మీలో నున్న క్రీస్తే" బయలుపరచబడిన ఆ మర్మము అని పౌలు చెప్పెను.

**కాలము సంపూర్ణమైనప్పుడు**, అనునది *plērōma* ("సంపూర్ణము") మరియు *kairos* ("కాలము") అను పదము నుండి వచ్చినది.[54] ఇది క్రైస్తవ యుగమును – దేవుని మర్మము బయలుపరచబడిన కాలమును సూచిస్తున్నది. గలతీయులకు 4:4లో "కాలము సంపూర్ణమైనప్పుడు, దేవుడు తన కుమారుని పంపెను" అని పౌలు చెప్పెను. పౌలు *chronos* అను ఉప పదమును ఏదో ఒకటి జరిగిన కాలమును సూచించుటకు "కాలము" అను పదమును వాడెను.[55] "సంపూర్ణము" అను పదము చరిత్రలో నేరవేర్చబడి దీర్ఘకాలమైన తరువాత జరిగిపోయిన దానిని సూచిస్తున్నది.

> "కాలము సంపూర్ణమైనప్పుడు" అది మెస్సీయ్య వచ్చునది, అది దేవుని చేత నిర్ణయించబడినది, పితరులకు వాగ్దానము చేయబడినది, ప్రవక్తలు ప్రవచించినది, యూదులు ఎదురు చూచినది మరియు విశ్వాసులు ఆశతో ఆపేక్షించినది.[56]

"కాలములు" అనే బహు వచనము లోక కాలములన్నిటిని నొక్కి చెప్పుతుంది – పితరుల కాలములు మరియు మోషే ధర్మశాస్త్ర కాలములు – మరియు క్రైస్తవ యుగము. ఈ యుగములో, దేవుని పిల్లలకు ప్రత్యేకమైన ఆశీర్వాదములు, మేలులు ఉన్నాయి.

> ఎవరికి అనుగ్రహించుటకు ఉన్నవో వారు పరిపక్వమైన వయస్సునకు రాకమునుపు దేవుని ప్రత్యేకమైన ఆశీర్వాదములను, మేలులను పంచిపెట్టుట వీలుపడదు [గలతీయులకు 4:1–3] మరియు అందును బట్టి వారు ఇంకా సిద్ధపాటు కలిగి లేరు. వేచిచూసే కాలము జరిగిపోవాలి, మరియు సిద్ధపాటు ప్రక్రియా జరిగిపోవాలి మరియు పరిపక్వమైన కాలమునకు చేరుకున్నప్పుడు ఆశీర్వాదములు సంపూర్ణముగా అందించబడతాయి. గృహనిర్వాహకుడైన దేవుడు మరుగు చేయబడిన తన కృపాసంకల్పము నిమిత్తము ఈ తగిన

కాలమును నిర్ణయించెను. ఆ సమయము వచ్చినప్పుడు శరీరధారియైన క్రీస్తునందు ఆయన రహస్యమును బయలుపరచెను మరియు మానవులతో పూర్వము ఆయన కలిగియున్న వ్యవహారాలను వివరించుచు నూతనముగా పంపకము చేయువాటిని పరిచయము చేసెను మరియు సంపూర్ణమైన ఆయన కృపా ఉద్దేశమును బయలుపరుచుటలో దీర్ఘమైన ఆలస్యమును వివరించెను.[57]

ఈ "సంపూర్ణత" క్రీస్తు యుగమును తెచ్చెను, ఆయన శరీరధారియైనప్పటినుండి ఆయన రెండవ రాకడ వరకు వ్యాపించును. ఈ యుగములో దేవుడు చేయదలచుకున్నవాటన్నిటికిని ఇది సంబంధించి ఉంది.

**వచనము 10.** తరువాత, ఈ వచనము దేవుని సమస్తమైన ఏర్పాటు యొక్క స్వభావమును వివరించును. క్రీస్తునందు తన సంకల్పమును పౌలు ద్వారా వివరించుట వలన దేవుడు తన హృదయమును బయలుపరచెను. కొన్ని తర్జుమాలలో **ఈ** "*that is*" అనునది యిటాలిక్స్‌లో కనిపించును, అర్థమును స్పష్టీకరించుటకు తర్జుమా దారులచే చేర్చబడెనని తెలుపుటకు అలా చేసిరి. "కాలము సంపూర్ణమైనప్పుడు జరుగవలసిన యేర్పాటును బట్టి" "సమస్తమును క్రీస్తునందు ఏకముగా సమకూర్చవలెనని" తర్జుమా దారులు సరిగా తర్జుమా చేసారు.

**ఏకముగా సమకూర్చవలెనని** అనునది గ్రీకు క్రియా పదము *anakerhalaioō* నుండి, ఇక్కడ మరియు రోమీయులకు 13:9లో మాత్రమే కనిపించును.[58] "క్రీస్తునందు సమస్తమును సమకూర్చుట," "ఏకము చేయుట," "సంగ్రహము చేయుట" అని దాని అర్థము. రోమా పత్రికలో పౌలు మానవ సంబంధములకు ఉన్న "సంగ్రహముగా" ఆజ్ఞలను సమకూర్చి చెప్పెను: "'నిన్నువలె నీ పొరుగు వారిని ప్రేమించవలెను' అను విషయము ద్వారా సమస్త సంబంధములను క్రోడీకరించవచ్చును" అని పౌలు చెప్పెను. అన్ని ఆజ్ఞల సారము ప్రేమ; మరియు దేవుని సంకల్పము యొక్క సంగ్రహ సారము, **క్రీస్తే**.

గ్రీకులో చూచినట్లయితే అది "మరల సమకూర్చుట"[59] అను అర్థమునిచ్చును, అనగా ఒకసారి సమాధానపర్చబడియుండినది ఇప్పుడు వేరుచేయబడినది. ఒక్కప్పుడు ఏకముగా ఉండినది, తరువాత అన్యాక్రాంతం చేయబడినది, మరియు ఆకరిగా ఈ క్రైస్తవ యుగంలో బయలుపర్చబడిన దేవుని మర్మమును బట్టి సమాధానపర్చబడినది కనుక అది మరలా సమకూర్చబడినది? సందర్భమును గమనిస్తే, క్రీస్తునందున్న విశ్వాసులకు మరియు పరిశుద్ధులకు దేవుడు చేసిన కార్యములను సూచిస్తున్నది. మరి క్రీస్తునందు ఉన్నవారు ఏర్పరచబడాలి, దత్తత చేయబడాలి, విమోచింపబడాలి, మరియు క్షమింపబడాలి – మరియు క్రీస్తునందు ఉన్నవారు దేవుడు బయలుపర్చిన మర్మమును పొందియున్నారు గనుక – దీనిని బట్టి క్రైస్తవులు ఒక సందర్భములో పాపమును బట్టి దేవునికి దూరముగా ఉన్నవారే (యెషయా 59:1, 2). కాని ఇప్పుడు సమాధాన పరచబడినవారు. క్రీస్తు యొక్క సిలువ రక్తము ద్వారా భూమి యందేగాని పరలోకమందే గాని సమస్తమును తనకు సమాధాన పరచుటకు ఈ విధముగా చేసెను అని పౌలు కొలొస్సయులకు 1:20–22లో స్పష్టముగా చెప్పెను. ఆయన ఇంకా కొలొస్సయులను గూర్చి చెప్పుచూ, వారు ఇదివరకు దేవునికి దూరముగా ఉన్న వారు, దుష్ట క్రియలను చేయువారిగా ఉండినను, ఇప్పుడు దేవునితో సమాధాన పరచబడినవారుగా ఉన్నారు. క్రీస్తు రక్తము ద్వారా దేవుడు సిలువలో సాధించినది ఏమి? ఆయన పాపియైన

మానవుని సమాధాన పరచుకొనుటకు మార్గము సరాళము చేసెను. కనుక **పరలోకములో ఉన్నవే గాని భూమి మీద ఉన్నవే గాని** సమస్తమును ఏకముగా సమకూర్చుతాము అనేది అలంకారముగా చెప్పబడి అది క్రీస్తు యొక్క సమస్త విమోచనా కార్యమును సూచిస్తూ విశ్వమును తనతో సమాధానపర్చుకొనుటను సూచిస్తున్నది. ఎందుకంటె క్రీస్తు పాపియైన మానవుని కొరకు కాక దేవదూతల కోసమో, ఈ సృష్టి కోసమో తన రక్తమును చిందించలేదు కదా!

గ్రీకులో "క్రీస్తు" అను పదముతో ఒక ఉపపదం కనిపిస్తుంది. సాల్మండ్ దీని గూర్చి మాట్లాడుతూ అది 12వ వచనములో ఉన్నలాగున అధికారిక బిరుదుగా వాడబడినది అని చెప్పెను.[60] ఇంకా హెన్రీ అల్ఫ్రర్డ్, ఆ విధముగా ఉండుట ఒక ప్రత్యేక సందేశమును అందించుటకు వాడబడినది అని చెప్పెను.[61] దీని అంతటి విషయము ఏమి అంటే, క్రైస్తవ యుగములో "క్రీస్తు నందు" సమస్త పాపులను తన కొరకు సమకూర్చు కొనుటయైన తన సంకల్పమే. పరలోకమందున్న మరియు భూమిమీద వున్న "పలు రకాలైన వాటిని ఏకముగా సమకూర్చుట,"[62] మానవుని దేవునితో సమాధానపర్చుట అత్యున్నతమైన దేవుని ఉద్దేశమై ఉన్నది.

1:8–10లో, క్రైస్తవ యుగమని దేవుడు బయలుపరిచిన మర్మమును పౌలు వివరించాడు. ఈ యుగములోనే క్రీస్తు పాపులను దేవునితో సమాధాన పరిచే ప్రక్రియలో ఉన్నాడు; క్రీస్తునందు విశ్వాసులును మరియు పరిశుద్ధులైనవారు మరియు ఆయన లోనికి వచ్చినప్పుడు భూలోక మందున్న జనులను పరలోకముతో సమాధానపరచుచున్నాడు. పూర్వకాలమందు మర్మముగా ఉంచబడి ఇప్పుడు బయలుపర్చబడినదే దేవుని ఉద్దేశం.

## స్వాస్థ్యముగా ఎర్పరచెను (1:11–12)

**11–12 మరియు క్రీస్తునందు ముందుగా నిరీక్షించిన మనము తన మహిమకు కీర్తికలుగజేయవలెనని, దేవుడు తన చిత్తప్రకారమైన సంకల్పమునుబట్టి మనలను ముందుగా నిర్ణయించి, ఆయనయందు స్వాస్థ్యముగా ఏర్పరచెను. ఆయన తన చిత్తానుసారముగా చేసిన నిర్ణయముచొప్పున సమస్తకార్యములను జరిగించుచున్నాడు.**

క్రీస్తునందు ఉన్నవారు అనుభవించు ఆత్మ సంబంధమైన ఆశీర్వాదములను గూర్చి వ్రాయుట కొనసాగిస్తూ, పౌలు క్రీస్తు నందు ఉన్న క్రైస్తవ స్వాస్థ్యమును గూర్చి వ్రాసెను.

**వచనములు 11, 12.** క్రీస్తునందు దేవుని సంకల్పము చొప్పున మనము దేవునితో సమాధాన పరచబడినామని పౌలు చెప్పెను. ఇంకా, సమాధానపర్చబడినవారు క్రీస్తు నందు "స్వాస్థ్యమును పొంది" ఉన్నారని ఆయన చెప్పెను. ఇది ఆరవ ఆత్మసంబంధమైన ఆశీర్వాదము. NASB "ఆయన యందు" (10వ వచనములోని ఆకరి భాగములోని ముగింపులో కనిపించును) అను పదమును, KJVలో 10వ వచనముతో ఉన్నట్టు కాకుండ, 11వ వచనములోని "స్వాస్థ్యముతో" కూడ చేర్చెను. ఇలా ఉంచడం వలన, క్రైస్తవులకు ఒక ప్రత్యేకమైన వారసత్వము కలదని పౌలు చూపించెను. **ఆయనయందు** ("ఎవరి యందు") అనునది ఈ అధనపు దీవెనలను పరిచయము చేస్తున్నది.

**ఒక స్వాస్థ్యమును పొంది యున్నారు** అను మాటను శ్రద్ధగా ఆలోచించాలి. ఇది

*eklērōthēmen* గ్రీకు పదము యొక్క తర్జుమాయై యున్నది. ఈ పదము *klēroō*, "చీట్లు వేసి నిర్ణయించు"[63] మరియు "కొంత భాగమును కేటాయించు"[64] అనే భావమును ఇచ్చునది. లింకన్, దాని భావము, ఒకరిని చీట్ల ద్వారా నియమించుట అని చెప్పెను.[65] దీనికి సంబంధించిన *klēros* అను నామవాచకమును కొలొస్సయులకు 1:12లో వాడబడినది, అక్కడ దేవుడు విశ్వాసులను "వెలుగులో, పరిశుద్ధుల స్వాస్థ్యములో పాలుపొందుటకు" యోగ్యతను కలుగచేసెనని ఆ వాక్యము తెలుపుచున్నది. సెప్టూజంట్‌లో (LXX),[66] *klēros* అను పదము సంఖ్యాకాండము 26:55, 56లో వాగ్దాన దేశములో భూ భాగములను ఇశ్రాయేలీయులకు పంచిపెట్టు సందర్భములో వాడబడినది. LXXలో ఇశ్రాయేలీయులను దేవుని "భాగము" లేక "స్వాస్థ్యము" అని ద్వితీయోపదేశకాండము 9:29 మరియు 32:8, 9లో చెప్పబడినది. దీనిని బట్టి కొందరు విమర్శకులు ఎఫెసీయులకు 1:11 "మనము దేవుని భాగముగా ఏర్పరచబడినామని" ఉండవలెనని చెప్పుదురు. కొలొస్సయులకు 1:12 ఈ విషయమునే ప్రస్తావిస్తూ ఒక భాగమును లేక ఒక గమ్యమును పొందేలా దేవుడు విశ్వాసులకు యోగ్యతను ఇచ్చెనని చెప్పెను. మరియు ఎఫెసీలోని ఈ వాక్యభాగం ఒక గమ్యమును నియమించెను లేక కేటాయించెను అని చెబుతున్నది. 12వ వచనమునకు వచ్చినప్పుడు ఈ వివరణను ఎన్నుకోవాలి. అక్కడ దేవుడు వారసత్వమును నియమించి, మనము ఆయన "మహిమకు కీర్తి కలుగునట్లు" ఉండవలెనని ఉద్దేశించెను.

**వచనము 11.** జనులకొరకైన దేవుని సంకల్పము తన ప్రేమలో నుండి వచ్చెను (1:4). ఆయన "దయాసంకల్పము" (1:5, 9), మరియు ఆయన కృప (1:6–8). *క్రీస్తు నందు* ఉన్నవారు దేవుడు ముందుగా నిర్ణయించిన దానిని బట్టి అయన సొత్తైయున్నారు (1:4, 5 చూడుము).

మూడు పదములను పరిశీలించాలి. మొదట, **సంకల్పము** (*prothesis*) అనగా "ప్రణాళిక, సంకల్పము, చిత్తము, నిశ్చయించు."[67] అది దేవుడు ఉద్దేశ పూర్వకముగా చేసిన పథకం.[68] క్రీస్తు నందు ఉన్న విశ్వాసులు దేవునికి ఏమై ఉన్నారో అది యాదృచ్ఛికముగా లేక అకస్మికంగా కాలేదు కాని దేవుని "నిత్యమైన ప్రణాళికను" బట్టి జరిగినది.

రెండవది, **ఆలోచన,** ఇది *boulē* అను గ్రీకు పదము నుండి తీయబడినది, "పర్యాలోచన మరియు ప్రతిబింబం; ఆలోచనాకర్తలతో కూడిన సభను"[69] సూచిస్తుంది. క్రీస్తు నందు చేసిన ఆయన ఉద్దేశమును యాదృచ్ఛికముగా దేవుడు జరిగించలేదు. ఆయన తన "ఆలోచనకు సంబంధించిన సభను" ఒక దగ్గరికి తీసుకొని వచ్చెను. పేతురు కూడా ఇదే పదమును "దేవుని యొక్క ముందుగా నిర్ణయించబడిన ప్రణాళికను బట్టి" ("నిర్ణయించిన సంకల్పం"; NKJV; "నిర్ణయించిన ఆలోచన"; ASV) యేసు సిలువ వేయబడుటకు అప్పగించబడెను అని సంఘము ప్రారంభమైన మొదటి దినమున వాడెను (అపొస్తలుల కార్యములు 2:23). పరలోకములో మాత్రమే ఆ దృశ్యాన్ని ఊహించగలం – లోకము లేక మానవుని సృష్టించక ముందే – తండ్రి, కుమార, పరిశుద్ధాత్మ, కలిసి మానవుని పాపమునకు యెట్లు పరిహారము చేయవలెనో అని ప్రణాళిక వేసిన దానిని, మనము కేవలము ఊహించవచ్చు. అయితే ఇంతకు ముందు ఎవ్వరూ జన్మించని రీతిగా జన్మించి, చివరకు ఎవ్వరూ మరణించని విధముగా మరణించి మానవులకు విమోచనము కలుగజేయుటకు దైవత్వంలో ఒకడు లోకములోనికి వచ్చుటకు తీర్మానించబడెను. దేవుని ప్రణాళిక సంపూర్ణముగా ఆలోచించబడినది,

ఉద్దేశపూర్వకముగా నిర్ణయించదమైనది, మరియు ఆ సంకల్పమే కుమారుని లోకమునకు రక్షకునిగా పంపినది. ఆయన తండ్రి చిత్తమును జరిగించుటకు లోకమునకు హృదయ పూర్వకముగా వచ్చెను కాని ఆ "ఆలోచన" నిర్ణయము, ప్రణాళిక, అది నశించిన వారిని క్రీస్తు ద్వారా దేవుని స్వాస్థ్యముగా చేయుటకు ఉపయోగపడినది.

మూడవ పదము, ఆయన **చిత్తము**, అది గ్రీకు పదమైన *thelēma* నామవాచకము నుండి వచ్చినది. ఇది క్రొత్త నిబంధనలో దాదాపు 60 సార్లు కనిపించును.[70] కొన్ని సందర్భలలో మినహాయింపబడి, అది "చిత్తము" మరియు సాధారణముగా దేవుని చిత్తమును గూర్చి వివరించునది. *Boulē* దేనినైన చేయుటకు చేసే నిర్ణయమును సూచిస్తుంది, *thelēma* కార్యచరణలోనికి పురికొల్పే చిత్తమును సూచిస్తున్నది.[71] దేవుని సంకల్పములో, దైవిక మేధో సంపత్తి వినియోగించబడి మానవుల విషయము తను ఏమి చేయాలో నిర్ణయించునది *boulē*. దైవిక భావోద్వేగములు అందులో చేర్చబడియుంది, అనగా తన ప్రేమ ద్వార పురికొల్పుట కనిపిస్తున్నవి (1:4). చివరికి, క్రీస్తునందు *(thelēma)* తన సంకల్పమును చేయ మొదలుపెట్టునప్పటినుంచి, దైవ చిత్తము పాల్గొనియుంది. దేవుడు "సమస్తమును సమకూర్చి జరిగించును" అని రోమీయులకు 8:28లో పౌలు చెప్పినప్పుడు విమోచనకు మరియు విశ్వమునకు సంబంధించి సమస్తమైనవాటిపైయున్న దేవుని సర్వభౌమాధికారమును సూచించుచున్నది. లోకములోను, సంఘములోను సమస్తమును ఆయన చిత్తము చొప్పున మానవుల మేలు కొరకు మరియు తన మహిమకు కీర్తికలుగునట్లు జరిగించుచున్నాడు (దానియేలు 4:32 చూడు).

**వచనము 12. క్రీస్తునందు** దేవుడు మనకు చేసిన సమస్తము, ఆయన మనకు **నిరీక్షణను** ఇచ్చుటకు చేసెను – మనము **ఆయన మహిమకు కీర్తి కలుగజేయుటకు** ఉండునట్లు **చివరివరకు** మనకు నిరీక్షణను కలుగజేసెను. దీనికి ముందు, పౌలు "తన కృపా మహిమకు కీర్తికలుగు" విషయమును గూర్చి వ్రాసెను (1:6). నిరీక్షణను మరియు విమోచనము, క్షమాపణ, మరియు ఆలోచనలు (1:7–10) బట్టి మనము దేవుని కీర్తించుచున్నాము, మనము దేవుని వారసులము గనుక మనకు నిరీక్షణ ఉన్నది.

"నిరీక్షణ" అను పదమునకు గ్రీకులో *proelpizō* అనునది, "ముందుగా నిరీక్షించుట, ఒక వ్యక్తిలో గాని, ఒక విషయములో గాని అది జరగక ముందే నమ్ముట" అని Wuest నిర్వచించెను.[72] సాధారణమైన గ్రీకు క్రియా పదమైన *elpizō*కు, "నిరీక్షించుటకు" ముందు *pro* అనే పదము బలపరచునదై యుంది. మనము క్రీస్తునందు నిరీక్షించుచున్నాము ఏలయనగా ఒక వ్యక్తిలో మనకు నిరీక్షణ ఉన్నది. మనము సువార్తకు విధేయులైనాము గనుక "ఆయన యందు" నిరీక్షించుచున్నాము. "క్రీస్తులోనికి" బాప్తిస్మము పొందునప్పుడు (రోమీయులకు 6:3), మనము "క్రీస్తులో" జీవించుటకు ప్రారంభిస్తున్నాము. అక్కడ "ఆత్మసంబంధ ప్రతి ఆశీర్వాదములు" కనుగొన్నాము. అయినను, ఇక్కడ పౌలు ప్రధానముగా క్రీస్తు అను వ్యక్తి యందలి నిరీక్షణను గూర్చి చెప్పుచున్నాడు.

వచనము 12 గూర్చి ఇంకొక విషయము చూడవచ్చు. గ్రీకులో పౌలు "క్రీస్తు" అను పదమునకు ముందు ఉపపదమును ప్రత్యేకముగా వాడి, ఆయనే "మెస్సీయ్య" లేక "ఆయనే క్రీస్తు" అని సూచించెను (కొన్ని NASB ప్రతులలో సూచనలలో తెలిపారు).

"నిరీక్షణ" అనగా "ముందే నమ్ముట" అయినట్లయితే, కొందరు టీకాకర్తలు ఇది

క్రీస్తు రాకడ మరియు ఆయన రాకడకు ముందు నిరీక్షణ కలిగియున్న యూదులైన క్రైస్తవులను గూర్చి వ్రాయబడినది అని అన్నారు. పౌలు ఈ పత్రిక వ్రాసే సమయమునకు, ఈ యూదులు క్రీస్తు నందు ఉన్నారు. కావునా, ఈ దృకోణమునుబట్టి, “ఆ మెస్సీయ్యను” గూర్చిన రాకడ విషయమైన అనుభవములేని అన్యులైన విశ్వాసులకు యూదులు భిన్నమైన వారిని సూచిస్తుంది. “క్రీస్తు యేసునందు” **ముందుగా నిరీక్షించిన మనము** అను మాటలను ఉయోగించినప్పుడు పౌలు యూదా విశ్వాసులతో పాటు తనను కలుపుకున్నాడని, తరువాత “మీరు” *humeis* అని 13వ వచనములో అన్యులైన క్రైస్తవులను గూర్చి చెప్పాడని సాల్మండ్, వుఎస్త్, విన్సెంట్[73] వంటి టీకకర్తలు చెప్పుదురు.

గ్రీకులో “క్రీస్తు” అను పదమునకు ముందు ఉపపదమును ఉయోగించుట మరియు “మనము” అను బహు వచనముతో కూడిన సమాపక నామవాచకం యొక్క వినియోగము వారు చేయు ఆలోచనను సమర్థిస్తున్నాయా? కాక పోవచ్చు. మొదట, “మేము” మరియు “మీరు” అనునది పౌలు మొదటి పదునాలుగవ వచనములో అనేక సార్లు ప్రతి క్రైస్తవుని గూర్చి వాడెను. రెండవదిగా, మెస్సీయ్యను గూర్చిన ఇశ్రాయేలు యొక్క నిరీక్షణ శరీర సంబంధమైనది (రాజకీయమైన మెస్సీయ్యను ప్రజలు ఎదురుచూస్తున్నారు), గనుక ఈ నిరీక్షణ “దేవుని మహిమకు కీర్తి కలుగ” జేయుట అపురూపం. మూడవదిగా, ఈ వచన భాగముల సందర్భము క్రీస్తులో నున్న ఆశీర్వాదములు గనుక, మధ్యలో పౌలు ఆలోచన మార్చి క్రైస్తవ యుగమునకు ముందు విషయములను ప్రస్తావించాడనుట సరికాదు. నాలుగవదిగా, లేఖనములలో “క్రీస్తు” అను పదమునకు ముందు ఉపపదమును వాడుట సర్వసాధారణము. ఈ విధముగా ఎఫెసీ పత్రికలోనే 17 సార్లు వాడబడినది. మరియు ఇక్కడ ప్రత్యేకమైన ప్రాముఖ్యత ఉందని తలంచరాదు. ఐదవదిగా, క్రీస్తు నందు ఉన్న నిరీక్షణ సంపూర్ణముగా పొందియున్న క్రైస్తవ వారసత్వమును సూచిస్తున్నది, దానినే పౌలు దిగువ వచనములలో ప్రస్తావిస్తున్నాడు. గనుక, లేన్స్కి, లింకన్[74] మరియు ఇతరులు చెప్పినలాగే “క్రీస్తు నందు ముందుగా నిరీక్షించినవారు” అనగా పూర్తి వారసత్వము పొందక మునుపు, యూగాంతమందు క్రీస్తు యొక్క రాకడతో అది వచ్చును, ఆయన వాగ్దానములలో విశ్వాసముంచి ఆయన యందు నిరీక్షణ ఉంచిన ప్రతి క్రైస్తవుని సూచిస్తుందని మేము ముగింపునకు వచ్చాము.

### క్రీస్తునందు ముద్రింపబడుట (1:13, 14)

**13మీరును సత్యవాక్యమును, అనగా మీ రక్షణ సువార్తను విని, క్రీస్తునందు విశ్వాసముంచి, వాగ్దానము చేయబడిన ఆత్మచేత ముద్రింపబడితిరి. 14దేవుని మహిమకు కీర్తి కలుగుటకై ఆయన సంపాదించుకొనిన ప్రజలకు విమోచనము కలుగు నిమిత్తము ఈ ఆత్మ మన స్వాస్థ్యమునకు సంచకరువుగా ఉన్నాడు.**

**వచనములు 13, 14.** వీటికి ఉపోద్ఘాతముగా “మేము” మరియు “ఆయన యందు” అను వాటిని 10 నుండి 12 వచనముల వరకు చూద్దాం. ఇక్కడ వాడబడిన పదజాలము పౌలు ఎఫెసీలోని ప్రతి క్రైస్తవుని గూర్చి మాట్లాడుచున్నాడని తెలియును. ఒకవేళ 12వ వచనములోనున్న “మేము” యూదా క్రైస్తవులను గూర్చినదై, 13వ వచనములోనున్న

"మీరు" అనునది అన్యులైన విశ్వాసులును గూర్చినదైతే, యూదా క్రైస్తవులు క్రీస్తు చేత ముద్రింపబడినవారు కారా? దీనిని మనము అంగీకరించము, ఎందుకనిన, క్రీస్తు నందు ముద్రింపడుట అనునది ఆత్మసంబంధమైన ఆశీర్వాదములలో ఒకటై యుండి క్రీస్తు నందు ఉన్న ప్రతి విశ్వాసి అనుభవించనైయున్నది. అయితే, పౌలు తనను కూడ చేర్చుకున్న "మేము" అను పదమును వాడక, తన ప్రకటన వలన సువార్త సందేశము వినిన వారిని సంబోధించుటకు వాడెను. పౌలు ఎఫెసుకు వచ్చినప్పుడు, అప్పటికే తాను విని, విశ్వాసించి, ముద్ర వేయబడినవాడు. తాను ఎఫెసులో పరిచర్య చేసిన తరువాత, అక్కడి వారు తన మాదిరిగానే, విని, విశ్వసించి, ముద్రింపబడిన నూతన విశ్వాసులైరి. దీనిని బట్టే పౌలు "మేము" అను పదమును "మీరు" అని మార్చి వ్రాసెను.

14వ వచనములో, సువార్తకు విధేయత చూపించిన ఎఫెసీయులలోని జీవిత మార్పులు మరియు తన జీవితములో మార్పులు, మరియు "మనము" అను పదమును వాడి వారు ఇరువురు క్రీస్తు నందు అనుభవించే స్థితిని గూర్చి ప్రస్తావించెను.

"ఆయన యందు" అక్షర్థాంగా "ఎవరిలో" అనునది *en autōi* బదులుగా *en hōi* అయియుంది, ఈ విషయాన్ని NASB సూచనలలో తెలుపుతుంది. "ఆయన యందు" ముద్ర వేయబడుట అనగా ఏమి? చివరి ఆత్మసంబంధమైన ఆశీర్వాదమును చూచుటకు ముందు ఒక ప్రశ్నను ఆలోచింతుము: ఆయనయందు అని రెండవ సారి 13వ వచనములో మోటుగా ఎందుకు వాడెను? ఒక సమాధానము ఏమి అంటే, ముద్ర వేయబడుటకు ముందు జరుగవలసిన రెండు సంగతులను తన శ్రోతలకు జ్ఞాపకము చేయవలెనని పౌలు పరిశుద్ధాత్మ వలన ముద్రింపబడు ఆశీర్వాదమును చర్చించాడు. మొదటిది, వారు *సువార్తను విని ఉన్నారు,* మరియు రెండవదిగా, వారు దానిని *విని విశ్వాసించారు.* పౌలు ఎమంటున్నాడంటే, "సువార్తను వినిన దానిని బట్టి, విశ్వసించిన దానిని బట్టి ఇప్పుడు మీరు ముద్ర వేయబడితిరి." ఈ వాక్యం యొక్క భావం ఏమనగా "ఆయన యందు – సువార్త సత్యమును వినిన తరువాత, రక్షణ సువార్తను విన్న తరువాత, మరియు వినిన దానిని బట్టి – మీరు ముద్రింపబడియున్నారు." NASB కొన్ని ప్రతులలోని సూచనలలో "ఆయన యందు" అనుమాటను "విశ్వసించిరి" అనుమాటతో చేర్చిరి, అందునుబట్టి "ఆయన యందు విశ్వాసముంచిన" అని భాషాంతరం జరిగింది. ఎఫెస్సీలో ఉన్న వారు వినిన క్రీస్తు సువార్త సందేశముతో "విశ్వసించిరి" అనే పదం చేర్చబడియుంటే శ్రేష్ఠంగా ఉండేది. వారు సువార్తను విని మరియు దానిని విశ్వసించిరి, మరియు విని విశ్వసించుటవలన ముద్రింపబడుటకు మార్గం తెరువబడింది.

13వ వచనములో పరిశుద్ధాత్మ **వాగ్దానము చేయబడిన ఆత్మ** అని పిలువబడినది, ఇది అపొస్తలుల కార్యములు 2:38, 39లో ఉన్న వాగ్దానమును సూచిస్తుంది. అక్కడ, పేతురు ఈ విధముగా చెప్పాడు,

> పేతురు మీరు మారుమనస్సు పొంది, పాపక్షమాపణ నిమిత్తము ప్రతివాడు యేసుక్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి; అప్పుడు *మీరు పరిశుద్ధాత్మ అను వరము పొందుదురు. ఈ వాగ్దానము మీకును మీ పిల్లలకును దూరస్థులందరికిని, అనగా ప్రభువైన మన దేవుడు తన యొద్దకు పిలిచిన వారికందరికిని చెందునని వారితో చెప్పెను (వత్తి చెప్పడం చేర్చబడినది).*

ఈ వచనములు మారుమనస్సు పొంది బాప్తిస్మము పొందిన విశ్వాసులు రెండు వాగ్దానములు పొందిరి: పాపక్షమాపణ మరియు పరిశుద్ధాత్మ అను వరము. ఇంకొక వచన భాగాములో పేతురు చెప్పినది ఏమిటంటే, "ఆయనకు విధేయులగు వారికి" దేవుడు పరిశుద్ధాత్మను ఇచ్చును (అపొస్తలుల కార్యములు 5:32). పౌలు కొరింథీలోని క్రైస్తవులకు, "మీ దేహము దేవునివలన మీకు అనుగ్రహింపబడి, మీలో నున్న పరిశుద్ధాత్మకు ఆలయమై యున్నదని మీరెరుగరా? మీరు మీ సొత్తు కారు" అని చెప్పుట ద్వారా ఈ వరమును వివరించెను (1 కొరింథీయులకు 6:19). ఈ వచనములు పరిశుద్ధాత్మ అను వరము ఆత్మ తానే క్రైస్తవుల శరీరములో నివసించు దానిని చెప్పుచున్నది. ఇది అపొస్తలులు పొందిన పరిశుద్ధాత్మ బాప్తిస్మము కాదు (అపొస్తలుల కార్యములు 1:4-8 చూడు) మరియు అది అద్భుత వరములను గలిగినది కాదు కాని, ఇది అపొస్తలుల కార్యములు 2లో సువార్తకు విధేయత చూపిన ప్రతి విశ్వాసులు పొందినది.

"పరిశుద్ధాత్మ అను వరము" ఈ రోజున క్రైస్తవునికి ఏమి అర్థమును యిచ్చుచున్నది? రోమీయులకు 8:26, 27 మరియు గలతీయులకు 5:22, 23, మరియు ఎఫెసీయులకు 3:16; మరియు 1:13, 14 వంటి అనేక లేఖనములు దానికి సమాధానమిచ్చును. అయితే మనము దేవుని విషయములను ప్రతి మనిషిని తృప్తి పరిచేలా వివరించగలమని తలంచరాదు. "ఆహా, దేవుని బుద్ధి జ్ఞానముల బాహుళ్యము ఎంతో గంభీరము! ఆయన తీర్పులు శోధింప నెంతో అశక్యములు; ఆయన మార్గములెంతో అగమ్యములు!" అని చెప్పి పౌలు మనకు జ్ఞాపకము చేయుచున్నాడు (రోమీయులకు 11:33).

పౌలు **విశ్వాసమును** దాని విశేష అర్థముతో ఉపయోగించాడు అందులో విధేయత చూపడం కూడ చేర్చబడియున్నది. ఈ వాక్య భాగములో, విశ్వసించినవారు "పరిశుద్ధాత్మ వాగ్దానముతో" **ఆయనయందు ముద్రించబడియున్నారని** చెప్పాడు, అయితే సువార్తకు విధేయులు కాని యెడల పరిశుద్ధాత్మ వరము మరియు ముద్రింపబడుటయు ఉండదు (అపొస్తలుల కార్యములు 2:37-40).

13వ వచనములో సందేశమునకు గ్రీకు పదము, లోగోస్ అను పదము "వాక్యము" అని సాధారణంగా తర్జుమాచేయబడును. మన ఆలోచనలను మాటల ద్వారానే మాధ్యమీకరిస్తాము. యోహాను క్రీస్తును "వాక్యము" అని అనెను (యోహాను 1:1, 14) ఏలయనగా దేవుడు తన దైవత్వమును వివరించెను (యోహాను 1:18) మరియు యేసుక్రీస్తు ద్వారా ఆయన దైవీక చిత్తమును మనకు బయలుపరచెను (హెబ్రీయులకు 1:1, 2). **సత్య** సందేశము అనునది ఎఫెసీయులకు బోధింపబడిన వాక్యము "సత్యము" అని అర్థము. "సత్యము," *alētheia,* అను గ్రీకు నామవాచకమునకు "దైవీక వాస్తవమని"[75] అర్థము, "సత్యమునకు, వాస్తవమునకు, నిశ్చయమైనవాటికి, నిజమునకు"[76] సంబంధించినది. ప్రకటించిన వాక్కు దేవుని సత్యమును, క్రీస్తు, రక్షణ, మానవుని గూర్చిన విషయముల వాస్తవమును వెల్లడించును. "నీ వాక్యమే సత్యము" అని యేసు చెప్పెను (యోహాను 17:17), మరియు ఈ సత్య వాక్యమే మానవునిలో విశ్వాసమును పుట్టించుటకు రూపొందించబడినది (రోమీయులకు 10:17). "సత్య సందేశము" సువార్తయై యుంది, లేక **మీ రక్షణ** "శుభవార్త."[77] క్రొత్తనిబంధనలో "సువార్త" అనేది పాపము నుండి రక్షణను కలిగించునది. గనుక, సువార్త సందేశము మరియు సువార్త సత్యము రక్షణకు దారి చూపుచున్నది. సత్యము - ఆ సువార్త

– దేవుని వాక్యముగా అంగీకరించాలి (1 థెస్సలొనీకయులకు 2:13), విశ్వసించాలి (చూడు 2 థెస్సలొనీకయులకు 2:12 చూడు) ప్రేమించాలి (2 థెస్సలొనీకయులకు 2:10), మరియు విధేయత చూపాలి (1 పేతురు 1:22). ఈ సందేశమే అంగీకరించు ప్రతివానికి "రక్షణ కలుగ జేయుటకు దేవుని శక్తియై యుంది" (రోమీయులకు 1:16).

ఎఫెసీయులు సువార్త విని, విశ్వసించిన తరువాత, వారు "ఆయనయందు పరిశుద్ధాత్మతో ముద్రించబడిరి." ఈ ఆశీర్వాదము యొక్క ప్రాధాన్యత ఏమి? "ముద్రింపబడిన" అను పదము *sphragizō* అను పదము నుండి వచ్చినది, అది దేవుడు ఒక్క సారి చేసేదై యుంది.[78] అపొస్తలిక్ ఫాదర్స్ (ప్రాచీన సంఘములో అపొస్తలుల పండితులు లేక పండితులు అని అనబడిన రచయితలు) బాప్తిస్మమే ముద్ర అని చెప్పిరి.[79] అలెక్జాండ్రియా వాడైన క్లేమెంటు (క్రీ.శ. 150–215), మరియు షెఫర్డ్ ఆఫ్ హెర్మాస్ (క్రీ.శ. 110–140లోని రచనలు), వీరు బాప్తిస్మమునందు దేవుడు పరిశుద్ధాత్మను ముద్రగా ఇస్తాడని చెప్పిరి.[80] ఒకవేళ వారు బాప్తిస్మమే ముద్రయని నమ్మిన యెడల వారి యొక్క ముగింపు సందేహ పూరితమైనది, ఏలయనగా ఎఫెసీయులు విశ్వసించినప్పుడు, వారి బాప్తిస్మముతో కూడ చేర్చి, వారు ముద్రింపబడ్డారు. ముద్రింపబడుటను పాపక్షమాపణను లేక పరిశుద్ధాత్మ వరమును బాప్తిస్మముతో సమానంగా ఎంచుట కంటె అధికంగా, ముద్రించుటను బాప్తిస్మముతో సమపర్చకూడదు. ఇవన్నీ సంబంధము కలిగినవే కాని అన్నీ ఒకటి కాదు. ఈ లేఖన భాగములో "విశ్వాసించుట" ఒక విషయము, "పరిశుద్ధాత్మ వాగ్దానము" ఇంకొక విషయము, మరియు "ముద్రించబడుట" మరియొక విషయము.

ఒక క్రైస్తవుడు, మారుమనస్సు పొంది, పాపక్షమాపణ పొంది, పరిశుద్ధాత్మ వరము పొందిన తరువాత, పరిశుద్ధాత్మచే వాగ్దానము చేయబడిన ముద్ర పొందుతాడు. ఈ వరము ఒక సంచకరువు. సంచకరువు ముద్ర కాదు, అయితే పరిశుద్ధాత్మ **సంచకరువుగా ఉన్నాడు** (1:14). ఇదే విషయమును పౌలు 2 కొరింథీయులకు 1:21, 22లో యిలా చెప్పెను, "మీతో కూడ క్రీస్తునందు నిలిచియుండునట్లుగా మమ్మును స్థిరపరచి అభిషేకించినవాడు దేవుడే. ఆయన మనకు ముద్రవేసి, మన హృదయములలో మనకు ఆత్మ సంచకరవును అనుగ్రహించియున్నాడు." ఆయన ఇంకా ఈ విధముగా చెప్పాడు, "దీని నిమిత్తము మనలను సిద్ధపరచువాడు దేవుడే, మరియు ఆయన ఆత్మ అను సంచకరువును మనకు అనుగ్రహించి యున్నాడు." "సంచకరువు" అనునది *arrabōn* అను గ్రీకు పదము నుండి తీయబడినది, "వ్యాపారమును స్థిరపరుచుటకు ముందుగా చెల్లించునది మరియు కుదిరిన బేరములో కొంత ... ధనమును బజానగా ఇచ్చునది."[81] పౌలు ఈ పదమును అలంకారముగా వాడి, పరలోకములో మహిమపరచబడి రాబోవు **మన** నిత్య **స్వాస్థ్యమునకు** దేవుడు ముందుగా పరిశుద్ధాత్మను ఇచ్చెను అని చూపించెను (4:30; రోమీయులకు 8:23 చూడుము).

14వ వచనములో మన పూర్ణ విమోచనమునకు సంచకరువైన పరిశుద్ధాత్మ చేత పరిశుద్ధులను ముద్రించుటకు రెండు కారణములు చూపెను. మొదటిది, క్రైస్తవులు పరిశుద్ధాత్మను పొందియున్నారు. ఏలయనగా **ఆయన సంపాదించుకొనిన ప్రజలకు విమోచనము కలుగు నిమిత్తము** పరిశుద్ధాత్మను సంచకరువుగా ఇచ్చాడు. "సంపాదించుకొనిన ప్రజలకు విమోచనము కలుగు నిమిత్తము" అనునదే దాని అర్థం. "దేవుడు సంపాదించుకొనిన" అను పదము యిటాలిక్స్‌లో, సరియైన అర్థమిచ్చుటకు

తర్జుమా దారులచే చేర్చబడినదని సూచిస్తుంది. ఈ విషయంలో తర్జుమా దారులు సరిగా ఉన్నారు, ఏలయనగా దేవుడు సంపాదించు కొన్న వారు ఇక్కడ ఆలోచనలో ఉన్నారు. గ్రీకులో *apolutrōsis* "విమోచనము" పదము నుండి తీయబడినది, ఇది క్రొత్తనిబంధనలో ఇంకా 8 సార్లు దేవుని యొక్క కార్యముగా అగుపడును.

ఇందులో దేవుడు విమోచనము దయచేయు వాడును, మరియు సమస్తమైన వాటిని "సంపాదించుకొన్న వాడుగా" కనిపిస్తున్నది.[82] పాతనిబంధనలో (నిర్గమకాండము 19:5; ద్వితీయోపదేశకాండము 14:2 చూడు) మరియు క్రొత్తనిబంధనలో (1 పేతురు 2:9; అపొస్తలుల కార్యములు 20:28 చూడు) దేవుని ప్రజలు ఆయన సొత్తుగా వర్ణించబడిరి. 14వ వచనములో మరియు ఎఫెసీయులకు 4:30లో పౌలు రాబోవు ఆశీర్వాదములను దృష్టిలో ఉంచుకొని వ్రాసెను. కనుక, దేవుని వలన చివరి విడుదల, లేక విమోచనము అనగా "ఆయన వారైన వారిని సంపూర్ణముగా తన సొత్తుగా స్వాధీనపరచుకొనుట"[83] అని అర్థము.

పరిశుద్ధులను పరిశుద్ధాత్మ ద్వారా ముద్రించుటకు రెండవ కారణము, **ఆయన మహిమకు కీర్తికలుగుటకు**. ఈ ఉద్దేశము 6 మరియు 12 వచనములలో వివరించిన దానితో సమానముగా ఉన్నది. దేవుని సంకల్పం యొక్క ఆకరి నెరవేర్పు, అది ఇక్కడ ప్రకటింపబడి, సమస్త క్రైస్తవులు ఆయనను కీర్తించుటతో ప్రత్యుత్తరమిస్తుంది.

### లోతైన విశ్లేణం:
### "ముద్రింపబడుట" యొక్క సందర్భము
### (1:13)

బైబిలునందు ముద్రింపబడుట అను భావం ఎట్లు వాడబడినది? (1) ఒక రాజు యొక్క ముద్ర సత్యమైనదిగా ధ్రువీకరించును (ఎస్తేరు 3:12; 1 రాజులు 21:8). *క్రైస్తవులు ముద్రించబడినప్పుడు వారు నిజముగా దేవుని పిల్లలని చూపబడుదురు. వారు కేవలము దేవుని పిల్లలని అనబడుట కాదు కాని, వారు నిజముగా దేవుని పిల్లలు.* "ప్రియమైనవారలారా, మనము ఇప్పుడు దేవుని పిల్లలము" అని యోహాను చెప్పెను (1 యోహాను 3:2).

(2) ముద్ర భద్రత కొరకైనది. దానియేలు సింహపు గుహలో వేయబడిన తరువాత, ఆ గుహ ఒక రాతి చేత భద్రముగా ముద్రించబడినది మరియు రాజు యొక్క ఉంగరపు చిహ్నము కలిగి ఉన్నది (దానియేలు 6:17). అదేవిధముగా యేసు యొక్క సమాధి కూడా ఎవరూ జోక్యం చేయకుండునట్లు ముద్రించి భద్రం చేయబడినది (మత్తయి 27:62–66). *క్రైస్తవులు భద్రముగా ముద్రించబడినవారు.* "కడవరి కాలమందు బయలుపరచబడుటకు సిద్ధముగానున్న రక్షణ మీకు కలుగునట్లు, విశ్వాసముద్వారా దేవుని శక్తిచేత కాపాడబడు మీకొరకు, ఆ స్వాస్థ్యము పరలోకమందు భద్రపరచబడియున్నది." అని పేతురు అనెను (1 పేతురు 1:5). క్షేమముగా ఉండుటకు క్రైస్తవులు విశ్వాసము కలిగి, స్వభావ సిద్ధముగా క్రీస్తును వినుచూ అనుసరిస్తూ దేవునితో సహకరించాలి (యోహాను 10:28, 29).

(3) ముద్ర ఒక నియమింపబడిన యజమానుని సూచిస్తున్నది. 2 తిమోతి 2:18, 19లో పౌలు విశ్వాసము నుండి తొలగి పోకుండా స్థిరముగా వేయబడిన పునాది కదిలింప కుండునట్లు సత్యమును గట్టిగా హత్తుకొను కొందరు విశ్వాసులైన క్రైస్తవులను గూర్చి వ్రాసెను.

వారికి ముద్ర ఉన్నది అని ఆయన చెప్పెను: "తనవారు ఎవరో ప్రభువుకు తెలుసు." "దేవుని పునాది యొక్క స్థిరత్వము దాని పైన వేసిన ముద్రపై ఆధారపడి ఉన్నది."[84] పౌలు చెప్పిన ఈ అలంకార భావము, జనులు యింటి పునాది పై ఆ గృహము తమదేనని చెప్పుటకు చెక్కబడిన ముద్రను గూర్చిన వాడుకను పోలినది..."[85] అదేవిధముగా ప్రకటన 7:3–8లో చూచినట్లయితే పరిశుద్ధులకు యజమానుడైన దేవుని ముద్ర అగపడుచున్నది. *వాస్తవముగా క్రైస్తవులు దేవునికే చెందినవారు.*

(4) సంపూర్తియైన ఒక కార్యమును ముద్ర గుర్తించుచున్నది. యిర్మీయా 32:9–14లో, ప్రవక్త ఒక పొలమును కొన్నాడు. దానికి బేరము చెల్లించిన తరువాత ఒప్పంద పత్రాన్ని సంతకం చేసి ముద్రించాడు, అందులో బేరము కొరకైన కట్టడలు నియమాలు వ్రాయబడి యున్నాయి. కొనుగోలు యొక్క పత్రం సంతకం చేయబడి ముద్రించబడినప్పుడు వ్యాపారం పూర్తి అయినది. అలాగుననే, *క్రీస్తు సిలువ మరియు సువార్తకు విధేయత వలన పాపమునుండి విమోచింపబడినామని సూచించుటకు క్రైస్తవులు ముద్రింపబడ్డారు.*

(5) ముద్ర చిహ్నమై ఉండవచ్చు. రోమీయులకు 4:11లో పౌలు అబ్రాహాము "సున్నతి పొందక మునుపు, తనకు కలిగిన విశ్వాసమువలనైన నీతికి ముద్రగా, సున్నతి అను గుర్తు పొందెను ..." అబ్రాహాము యొక్క నీతికి ముద్రగా సున్నతి గుర్తుగా ఉన్నది. కొంత మంది వ్యాఖ్యానకర్తలు బాప్తిస్మము నీతికి ముద్ర మరియు చిహ్నము అని భావింతురు. ఈ టీకాకర్తలు కొలొస్సయులకు 2:11–13ను చూపించుదురు, అక్కడ పౌలు సున్నతికి బాప్తిస్మమునకు సంబంధమును చూపెను. ఈ ముద్ర విషయము గూర్చి మనము చాలా దూరం వెళ్లరాదు ఎందుకనగా అబ్రాహాము దేవునిచే నీతిమంతుడని ప్రకటింపబడిన తరువాత సున్నతి గుర్తును పొందాడు, అయితే మనము దేవుని యెదుట చక్కగా నిలబెట్టబడినవారమై మరియు మన పాపములు క్షమింపబడక మునుపు బాప్తిస్మము వచ్చును (అపొస్తలుల కార్యములు 2:38 చూడు). మరియు, పరిశుద్ధాత్మచే ముద్రింపబడుట అనునది క్రైస్తవునికి లేక క్రైస్తవుని కొరకు చేయునది, అయితే బాప్తిస్మము పొందునది. ఏది ఏమైనప్పటికీ, క్రైస్తవులు పొందు ముద్ర నిజమైన దానికి, భద్రతకు, దేవుడే సంపాదించుకొనెను అనుటకు, మరియు సంపూర్ణముగా విమోచనము పొందామనుటకు చిహ్నము.

## అన్వయము

### "నేను దీవింపబడ్డాను" (1:3)

"ఎలా ఉన్నావు?" అను నా వందనములకు నాకున్న ఒక స్నేహితుడు: "నేను దీవింపబడ్డాను" అని ఎల్లప్పుడు సమాధానమిస్తాడు. అవును అతను నిజమే పలికాడు. అతను దీవింపబడ్డాడు, మరియు అలాగే మనము కూడా దీవింపబడ్డాము.

భౌతికమైన దీవెనలతో దేవుడు మనలందరిని సమృద్ధిగా దీవించును (చూడు మత్తయి 5:45; యాకోబు 1:17). కాని తన పిల్లలకు, దేవుని నుంచి వాటి కంటే ఎక్కువ ఆశీర్వాదములు కలవు: ఆయన మనలను "క్రీస్తునందు ఉన్న ప్రతి ఆత్మ సంబంధమైన ఆశీర్వాదములతో ..." దీవించును (1:3). ఈ ఆశీర్వాదలను గూర్చిన రెండు సత్యములను గమనించాలి: అవి దేవుని నుండి వచ్చును, మరియు అవి కేవలము "క్రీస్తునందున్న" వారికి మాత్రమే లభించును.

### "క్రీస్తునందు" (1:3–14)

"క్రీస్తునందు" అనునది పది సార్లు పౌలు 3 నుండి 14వ వచనములలో వాడాడు (1:3, 10, 12), "ప్రియుని యందు" (1:6), లేక "ఆయన యందు" (1:4, 7, 9, 10, 13 [రెండు సార్లు]).[86] ప్రతి ఆత్మ సంబంధమైన ఆశీర్వాదమును పొందాలంటే, ఆ వ్యక్తి ఆశీర్వాదములు లభించు చోట ఉండవలెను – అనగా "క్రీస్తునందు" (1:3). ఒక వ్యక్తి క్రీస్తునందు యెట్లు ప్రవేశించగలడు?

> క్రీస్తు యేసులోనికి బాప్తిస్మము పొందిన మనమందరము ఆయన మరణములోనికి బాప్తిస్మము పొందితిమని మీరెరుగరా? కాబట్టి తండ్రి మహిమవలన క్రీస్తు మృతులలో నుండి యేలాగు లేపబడెనో, అలాగే మనమును నూతనజీవము పొందినవారమై నడుచుకొనునట్లు, మనము బాప్తిస్మమువలన మరణములో పాలు పొందుటకై ఆయనతో కూడ పాతిపెట్టబడితిమి (రోమీయులకు 6:3, 4).

> యేసుక్రీస్తునందు మీరందరు విశ్వాసమువలన దేవుని కుమారులై యున్నారు. క్రీస్తులోనికి బాప్తిస్మముపొందిన మీరందరు క్రీస్తును ధరించుకొనియున్నారు (గలతీయులకు 3:26, 27).

"క్రీస్తునందున్న" ఆత్మసంబంధమైన ఆశీర్వాదములు అన్ని ఆశీర్వాదములకంటే శ్రేష్ఠమైనవి. ఈ ఆశీర్వాదములు క్రైస్తవునికి ఆత్మసంబంధమైన, సమృద్ధికరమైన, నిత్య జీవమును ఇచ్చును.

జే లాక్హార్ట్

### క్రైస్తవుని భూత, వర్తమాన, భవిష్యత్ (1:3–14)

సాదారణముగా 1:3–14ను మూడు విభాగాలుగా చేయబడును:

- 3–6 వచనములు: ఈ ఆత్మసంబంధమైన ఆశీర్వాదములు పొందు శరీరమును గూర్చిన గతంలోని దేవుని ఏర్పాటును పౌలు చర్చించెను.
- 7–12 వచనములు: పౌలు దేవుడు క్రీస్తు యొక్క శరీరముతో వర్తమాన కాలములో చేయువాటిని గూర్చి చర్చించెను.
- 13, 14 వచనములు: మర్మయుక్తమైన శరీరమును గూర్చి ప్రస్తావించి, దాని భవిష్యత్తును చర్చించెను.

### మనము ఏర్పరచబడిన వారము! (1:4–6)

దేవుడు తన ప్రజలుగా, తన పిల్లలుగా, తన శరీరముగా, తన సంఘముగా ఉండునట్లు ఏర్పరచుకొనెను. ఒక మాటలో చెప్పాలంటే, ఇలా ఎంపిక చేసుకొనుటయే "ఏర్పరచుకొనుట" (చూడు 1 థెస్సలొనీకయులకు 1:4; KJV). ఎఫెసీయులకు 1:4–6లో పౌలు ఏర్పరచుకొనుట అను గొప్ప బైబిలు సిద్ధాంతమును గూర్చి 7 లక్షణాలును చర్చించెను:

*పద్ధతి.* "ఆయన … మనలను *ఏర్పరచుకొనెను* …" (1:4–6; నొక్కి చెప్పినది చేర్చబడినది). దేవుడు ఈ శరీరమును యెట్లు నిర్మించెను? దానికి అవయవములు యెట్లు

చేర్చబడినవి? అదేదో యాదృచ్ఛికముగా జరిగినది కాదు. దేవుని అధికారముతో కూడిన తన చిత్తము వలన మనము ఆయన శరీరము అనగా, సంఘములో భాగమైయుండుటకు ఆధిక్యతను కలిగియున్నాము.

మనమేదో మంచి క్రియలు చేస్తున్నా మనో, లేదా మనము ఇతరుల కంటే గొప్ప వారలమనో మనలను క్రీస్తు శరీరములో భాగముగా చేయలేదు. మనము ప్రతి ఆదివారము ఆరాధనకు హాజరు అవుచున్నందునో లేదా ప్రతి ఆదివారమున ప్రభువు రాత్రి భోజనములో పాలుపొందుచున్నందునో కాదు. ఇవన్నీ ప్రాముఖ్యమైనవే కానీ, సత్యము ఏమంటే: దేవుడు నిత్యత్వములోనే మనము ఆ శరీరములో భాగమైయుండాలనుకొనెను గనుక మనము ఆయన శరీరములో ఉండగలము. దేవుని అధికారము మనలను ఆయన శరీరములో ఉండాలని ఆలోచించకపోతే, లోకములో నున్న సమస్త మతాచారములు మనలను శరీరములోనికి చేర్చలేవు.

ముందుగా ఏర్పరచుకొనుట (ముందుగా నిర్ణయించుట) అను సిద్ధాంతము కొన్ని శతాబ్దములవరకు ప్రజలకు అర్థముకాని విషయముగా ఉండినది. గొప్ప బైబిలు పండితులు – అగస్టిన్ నుండి వెస్లీ[87] వరకు – ఈ సమస్యను పరిష్కరించడానికి ప్రయత్నించిరి: దేవుడు తన అధికారము చొప్పున మనలను ఏర్పరచుకొనును అని ఒక చోట మరియు "యిచ్ఛయించిన వానిని రానిమ్ము" అని వేరొక చోట ఏ విధముగా క్రొత్త నిబంధన రెండు పరస్పర విరుద్ధమైన బోధలను చేస్తున్నదని ప్రశ్నించిరి?

ప్రేమామయుడైన దేవుడు కొందరిని మంచికి మరి కొందరిని చెడుకు ఎంపికచేసుకొనునా? ఈ పురాతనమైన ప్రశ్నకు సమాధానము లేఖనములో ఉన్నది. దానిని విచారించుటకు ముందే ఒక విషయమును గ్రహించాలి: ప్రతి క్రైస్తవుడు ఆయన శరీరములో భాగమై యున్నాడని పరలోకమునకు బంధింపబడి యున్నాడని ఒకే ఒక కారణము చేత జరుగును: దేవుడు మనలను ఏర్పరచుకొనెను.

దేవుడే మనలను ఏర్పరచుకొనెను అను విషయము మన స్వాభిమానమును పెంపొందించాలి. క్రైస్తవులమని చెప్పుకొనుటకు ఎందుకు సిగ్గుపడాలి? విశ్వమునకు అధిపతియైన దేవుడే మనలను ఘనపరిచెను. దేవుడు మనలను ఏర్పరచుకొనెను!

*విషయము.* "... ఆయన *మనలను* ఏర్పరచుకొనెను ..." (1:4–6; నొక్కి చెప్పింది చేర్చబడినది). ఇతర సమాజములో దేవునిని ఆరాధించువారు ఉన్నను దానికి వ్యతిరేకముగా దేవుడు *మనలను* ఏర్పరచుకొనెనని పౌలు చెప్పుచున్నాడా? లేదు, మనము రక్షించబడునట్లు ఇతరులు నశించునట్లు ఆయన ఏర్పరచుకోలేదు. అట్లయిన యెడల దేవుడు ఏర్పరచుకొనెను అని పౌలు చెప్పుటలోని అర్థమేమిటి?

పౌలు మాటల అర్థమును గ్రహించుటకు హెబ్రీయులకు 2:16 మనకు సహాయము చేయును: "ఏలయనగా ఆయన ఎంతమాత్రమును దేవదూతల[కు] (సహాయము చేయక) స్వభావమును ధరించుకొనక, అబ్రాహాము సంతాన[మునకు] (సహాయము చేసెను) స్వభావమును ధరించుకొనియున్నాడు." నశించిన దేవదూతలను రక్షించుట దేవుని ఆలోచన కాదు. వారు దేవుని చేత విమోచింపబడిన ఒక్క శరీరములో భాగము కాదు. దేవుడు మానవులను తన మహిమ శరీరములో భాగముగా ఉండుటకు నియమించెను. ఆయన మనలను ఏర్పరచుకొనెను.

జాగ్రతగా లేఖనమును పరిశీలించండి. ఈ ఏర్పరచుకొనుట అను పురాతనమైన ప్రశ్నకు సమాధానము: "ఆయన క్రీస్తులో మనలను ఏర్పరచుకొనెను ..." (1:4-6; నొక్కి చెప్పినది చేర్చబడినది).

దేవుని సర్వభౌమ చిత్తానుసారమును బట్టి, క్రీస్తు యేసునందు ఉన్నవారిని నిత్య జీవమునకు ఏర్పరచెను. ఆ నిర్ణయము మార్చలేనిది. దేవుని వలె అది నిరంతరముగా నిలుచునది. క్రీస్తునందు ఉన్న వారు తప్ప వేరే ఎవరు రక్షించబడరు. ప్రభువైన యేసునందున్న వారు మాత్రమే నిత్య జీవమును పొందుదురు.

ఎవరు యేసునందు ఉందురు? మహిమకు తేబడు ఈ ఒక్క శరీరములోని భాగముగా ఎవరు ఉందురు? సువార్తకు విధేయత చూపిన వారు ఎవరైనా సరే! వచ్చుటకు యిచ్ఛయించినవారు ఎవరైనా సరే! ఎవరైనా సరే దేవుని యొద్దకు వచ్చి ఆయన చేత ఏర్పరచబడవచ్చును.

*సందర్భము.* జగత్తుపునాది వేయబడకమునుపే, ప్రేమచేత ఆయన క్రీస్తులో మనలను ఏర్పరచుకొనెను ... (1:4-6). క్రీస్తులోనున్న వారు నిత్య జీవమును మరియు ఆత్మ సంబంధ ఆశీర్వాదములను పొందునట్లు ఎప్పుడు నిర్ణయించెను? జగత్తు పునాది వేయబడకమునుపే దేవుడు తన సమస్తమైన ప్రణాళికను వేసెను. ఏదెను తోటలో మానవుని తిరుగుబాటు దేవునికి ఆశ్చర్యము కలిగించలేదు. మన వెర్రితనము నుండి మనలను రక్షించుటకు ముందుగానే ప్రణాళికను సిద్ధము చేసుకొనెను. ప్రకటన 13:8లో "జగదుత్పత్తి మొదలుకొని వధింపబడియున్న గొఱ్ఱెపిల్ల యొక్క జీవగ్రంథమందు" వ్రాయబడిన పేర్లుకు వర్తిస్తుంది (చూడు 2 థెస్సలొనీకయులకు 2:13; 2 తిమోతి 1:9).

దేవుడు నిన్ను అంతగా ప్రేమిస్తున్నాడని నమ్మగలవా? నీవు జన్మించక మునుపు, ఈ విశ్వం కేవలం సంకల్పంలో మాత్రమే ఉన్నప్పుడు, నీవు పాపము చేసి ఆయన హృదయము బద్ధలు చేస్తావని ముందే దేవునికి తెలుసు. అయినను నిన్ను ప్రేమించి నిన్ను ఏర్పరచుకొనెను.

*ప్రణాళిక.* "మనము తన యెదుట పరిశుద్ధులమును నిర్దోషులమునై యుండవలెనని జగత్తుపునాది వేయబడకమునుపే, ... ఆయన యందు ఏర్పరచుకొనెను" (1:4-6). దేవుడు ఎందుకు ఇలా చేసెను? దీని అంతటిలో ఆయన ప్రణాళిక ఏమిటి? దేవుడు మన సహవాసమును కోరుకొనుచున్నాడు. ఆదాము హవ్వ ఏదెను తోటలో నుండి వెళ్లగొట్టబడుటకు ముందు ఉన్నలాగున ఆయన మరలా మానవునితో నడుచుట, మాటలాడుట కోరుకున్నాడు. అయినప్పటికీ మనము దేవుని సన్నిధి చేరాలంటే పరిశుద్ధత మరియు అనిద్యత అను రెండు గుణములు అవసరము.

మనకు ఏదైనా కొదువుగా ఉన్నదంటే అది ఈ రెండు గుణములైన పరిశుద్ధత మరియు నిర్దోషత్వం. అందరు పాపము చేసియున్నారు. ప్రతి ఒక్కరు దేవునితో సహవాసము పొందుటకైన దైవప్రమాణికతకు కొదువైయున్నారు. మన సొంత మార్గాలకు వదిలిపెట్టబడినవారమైన యెడల ఎన్నటికి దేవుని ఎదుర్కొలేని స్థితిని చేరుకున్నవారమైయుందుము, అయితే యేసు కల్వరిలో చేసిన కార్యము ద్వార మరలా ఆయన సన్నిధిని చేరుటకు ఆధిక్యతను కలిగియున్నాము. క్రింద ఇలా చదువుతాము,

> ... అటువలె క్రీస్తు కూడ సంఘమును ప్రేమించి, అది కళంకమైనను ముడతయైనను అట్టిది మరి ఏదైనను లేక, పరిశుద్ధమైనదిగాను, నిర్దోషమైనదిగాను మహిమగల సంఘముగాను ఆయన తనయెదుట దానిని నిలువబెట్టుకొనవలెనని, వాక్యముతో ఉదకస్నానముచేత దానిని పవిత్రపరచి, పరిశుద్ధపరచుటకై దానికొరకు తన్ను తాను అప్పగించుకొనెను (5:25–27).

*ఉద్దేశము.* "తన ప్రియునియందు ... మనలను ... నిర్ణయించు" కొనెను (1:4–6). ఇంత కష్టపడవలసిన అవసరము దేవునికి ఏమి? మన మంచితనమా? మనము కోరదగిన వారమనా? మన అద్భుతమైన వ్యక్తిత్వములా? లేదు. కేవలము ఆయన మనలను ప్రేమించుట వలనే (యోహాను 3:16).

నీ జీవితములో రహస్య పాపమున్నదా? నీ జీవితము దేవుని యెడల ప్రేమలేనిదిగా, అక్కర లేనిదిగా ఉన్నదా? దానితో సంబంధం లేదు. అయినను దేవుడు నిన్ను ప్రేమిస్తున్నాడు. నిజమైన సహవాసము నీతో ఏర్పరచుకొను నిమిత్తము ఆయన భూమ్యాకాశములను కదిలింపచేసియున్నాడు.

దేవుని ప్రేమనుబట్టి మన నిత్యమైన గమ్యము భద్రముగా ఉన్నది. ఇందులో లొసుగులు లేవు. క్రీస్తునందున్న ఎవరైనను ఆకస్మికంగా చూచి చూడనట్లు ఉండలేము. నీవు యేసునందు ఉన్న యెడల దేవుని రక్షణ ప్రణాళిక నీకు వర్తిస్తుంది. దేవుని గొప్ప ప్రేమ మానవులు ఆయన యొద్దకు తిరిగి వచ్చుటకు మార్గమును సరాళము చేయుటకు దేవుని పురికొల్పెను.

*ఫలితము.* "యేసుక్రీస్తు ద్వారా తనకు కుమారులనుగా స్వీకరించుటకై, మనలను ముందుగా తన కోసము నిర్ణయించుకొని ..." (1:4–6). ఈ వాక్య సందేశమును బట్టి మనము సంతోషించాలి. మనము దాసులమో, పనివారమో, స్నేహితులమో, పొరుగువారమో, తోటి పని వారమో కాదు. మనము కుమారులము! లూకా 15లో తప్పిపోయిన కుమారునివలె తిరిగి తండ్రి యొద్దకు వచ్చినట్లయితే మరల పూర్తి సహవాసము పొందుదము. అలాగే, దేవుని కృపవలన సంపూర్ణమైన ఆధిక్యతలను అనుభవించునట్లుగా దేవుని కుటుంబమును తిరిగి చేరుటకు మనము అనుమతిపొందియున్నాము.

కుమారులమైతే, దేవునికున్న సమస్తము మనదే అని మనకు చెప్పబడియున్నది (చూడు లూకా 15:22). మనము దత్త పుత్రులుగా చేయబడి, దానితో పాటు వచ్చు సమస్త ఆశీర్వాదములు పొందుదము.

*గమ్యము.* "తన ప్రియునియందు తాను ఉచితముగా మనకనుగ్రహించిన తన కృపామహిమకు కీర్తి కలుగునట్లు, చిత్త ప్రకారమైన దయాసంకల్పము చొప్పున, యేసుక్రీస్తు ద్వారా తనకు కుమారులనుగా స్వీకరించుటకై, మనలను ముందుగా తన కోసము నిర్ణయించుకొని, ..." (1:4–6). ఇదంతా దేవుడు ఎందుకు చేసెను? నిర్దోషులుగా మరియు పరిశుద్ధులుగా ఉండుటకు మనలను పిలిచి ఏర్పరచుకొనుటలోని దేవుని గమ్యమును గ్రహించవలెను.

పాపుల మీద జాలిపడో లేదా నరకము నుండి రక్షింపగలననో దేవుడు పాపులను రక్షించుట లేదు. అన్ని కారణముల కంటే మిన్నగా, దేవుడు మానవ చరిత్రలో కార్యములను జరిగించి మనుష్యులను రక్షించి తను నిత్యము కీర్తించబడుటకు ఈ విధముగా చేసెను. పతనమైన మానవుడు కోరదగని విమోచన చెప్ప శక్యము కాని దేవుని జ్ఞానమును బయలుపరుస్తుంది మరియు దేవదూతల సమూహము ఆయన నామమును కీర్తించెలా

చేయును.

*ముగింపు.* ఆయన సహవాసమును మనము మరలా పొందేలా మనలను పరిశుద్ధులనుగాను నిర్దోషులుగాను పునరుద్ధరింపజేయుట వలన – దానిని పొందుటకు మనము యోగ్యతలేనివారమైనప్పటికి – దేవుని హృదయానికి ఎంతో ఆనందాన్ని తెస్తుంది. అందు నిమిత్తమే మనము పరిశుద్ధతను చులకనగా చూచినట్లయితే అది ప్రమాదకరము. ఆయన కృప వలన ఏర్పరచబడినవారి ద్వారా దేవుడు కావాలని కోరుకున్న సంతోషమును హరించి వేయుదము. ఇశ్రాయేలు పరిశుద్ధ దేవుని చేత ఏర్పరచుకొనిన ఆయన పిల్లలుగా మనము జీవించుదము.

క్రిస్ బుల్లర్డ్

**ఆత్మ సంబంధమైన ఆశీర్వాదములు విశదీకరించబడినవి (1:4–14)**

1:4–14 వరకు పౌలు ఏడు ఆత్మసంబంధమైన ఆశీర్వాదములను పేర్కొన్నాడు. "ఏడు" అను సంఖ్య పరిపూర్ణమునకు లేక సంపూర్ణతకు చిహ్నము. కనుక దీనిలో క్రీస్తునందు లభ్యమయ్యే సమస్త ఆశీర్వాదములు సంక్షిప్తపరచబడినది. (1) క్రీస్తునందు మనలను ఏర్పరచుకొనెను (1:4–6). మనము పరిశుద్ధలమును నిర్దోషులుముగా ఉండునట్లు దేవుడు నిత్యత్వములో ఏర్పరచుకొనెను. (2) మనము క్రీస్తునందు ముందుగా నిర్ణయించబడినవారము (1:4–6). దేవుని ప్రేమ మరియు కృపను బట్టి మనము దత్తపుత్రులము కావలెనని ముందుగా నిర్ణయించెను, దానిని ఆయన "తన ప్రియునియందు" విస్తరింపజేసెను. (3) మనము క్రీస్తు నందు ఆయన రక్తము వలన విమోచింపబడితిమి (1:7). (4) ఆయన కృప మన మీద విస్తరించుట వలన మన అపరాధములు క్షమించబడినవి (1:7, 8). (5) పరలోకమును భూమినీ ఏకము చేయుటకై తన మర్మమును వెల్లడిపరచుటవలన మనము వెలిగింపబడ్డాము (1:9, 10). (6) దేవుని మహిమకు కీర్తికలుగునట్లు క్రీస్తునందు స్వాస్థ్యమును పొందియున్నాము (1:11, 12). (7) క్రీస్తులోనికి వచ్చినప్పుడు మనము ఆత్మ చేత ముద్రింపబడితిమి. మన విమోచనకు లేక విడుదలకు, మరియు దేవుని మహిమను కీర్తించుటకు మనకు పరిశుద్ధాత్మ అను వరము స్వాస్థ్యమునకు సంచకరువుగా ఉన్నాడు (1:13, 14).

జే లాక్వార్డ్

**క్రొత్త ప్రజలుగా ఉండుటకు విమోచింపబడితిమి (1:6–10)**

తన క్రైస్తవ జీవితము గూర్చి చెప్పమని ఒక మనిషిని అడిగారు. ఒక్క క్షణము ఆలోచించిన తరువాత ఈ విధముగా చెప్పెను, "నేను ఎలా ఉండవలసి ఉన్నదో అలా లేను; నేను ఏమి అవ్వ బోతున్నానో అలా లేను; కాని నేను ఇదివరకు ఎట్లా ఉన్నానో ఇప్పుడు అలా లేను, అందుకు దేవునికి కృతజ్ఞతా స్తుతులు చెల్లిస్తున్నాను!"

మనమందరము కూడ అటువంటి మాటనే చెబుదుము కాదా? మనము యేసు యొద్దకు వచ్చాము గనుక, మన జీవితములో విప్లవాత్మక మార్పులు రావాలి. క్రైస్తవ్యము అనేది ఏదో మనము మరణించిన తరువాత పొందే మేలు అనుకుంటె పొరపాటే. దేవుని మర్మము అనగా తన శరీరమనబడిన తన సంఘములో పాలుపొందినట్లయితే దాని

ఫలములు ఇప్పుడే ఈ లోకములోనే చూతుము.

ఎఫెసీయులకు 1:6-10లో మనలను విడుదలచేయు విమోచనము గూర్చి ఐదు విషయములను పౌలు వెల్లడిపరచెను. ఈ క్రమము మనలను జగత్తుపునాది వేయబడక మునుపు క్రీస్తు మర్మము, అనగా నిత్యత్వము కొరకు ఏర్పరచబడిన ఆయన శరీరములో పాలు పొందుటకు సహాయము చేయును.

*విమోచకుడు.* "ఆయనయందు" మనకు విమోచనము కలుగుచున్నది అని పౌలు చెప్పెను (1:7). ఎవరియందు? 6వ వచనము ప్రకారము ఆయన ఎవరు అంటే, తండ్రియైన దేవుడు ఎవరిని ప్రేమిస్తున్నడో, ఆయనే. అది ఎవరో కాదు ప్రభువైన యేసుక్రీస్తే (మత్తయి 3:17; 17:5).

కొలొస్సయులకు వ్రాస్తూ పౌలు ఈ విధముగా చెప్పాడు, "ఆయన మనలను అంధకారసంబంధమైన అధికారములో నుండి విడుదలచేసి, తాను ప్రేమించిన తన కుమారుని యొక్క రాజ్యనివాసులనుగా చేసెను. ఆ కుమారునియందు మనకు విమోచనము, అనగా పాపక్షమాపణ కలుగుచున్నది" (కొలొస్సయులకు 1:13, 14).

యేసే దేవుని ప్రియుడు, మరియు ఆయన మన విమోచకుడు. ఆయనయందు మనము అంగీకరించబడ్డాము. విమోచనమునకు ఒకే ఒక్క చోటు కలదు: *క్రీస్తునందు.* దేవుడు మనలను విమోచించి, మన పాప సమస్య తీసివేసినప్పుడు - అనగా మనలను పాపము యొక్క స్వాధీనములో నుండి క్రయధనము ద్వారా తిరిగి కొనినప్పుడు - మనము తన ప్రియునియందు అంగీకరించబడుదుము.

అది ఆశ్చర్యకరమైనది! యేసునందుండుట దేవునిచే అంగీకరింపబడుట. మన నిత్య గమ్యాన్ని గూర్చి రాత్రి నిద్రలో మేల్కొని చింతించవలసిన అవసరములేదు. నిజముగా క్రీస్తునందున్న వారు తృణీకరింపబడరు ఏలాయనగా యేసు తండ్రిచే తృణీకరింపబడలేదు.

క్రీస్తే పరిపూర్ణమైన విమోచకుడు. (1) ఆయన రక్తమాంసములు ధరించుకొనుట చేత ఆయన మన బంధువు. అన్ని విధములలో మనవంటివాడాయెను; ఆయన మనలో ఒకడాయెను (చూడు హెబ్రీయులకు 2:17). ఏ దేవదూత కూడా విమోచనా క్రయధనమును చెల్లించ లేదు ఎందుకంటె వారు మానవులతో బాంధవ్యం గలవారు కారు. యేసు మనలో ఒకడుగా జీవించెను, కనుక ఆయన మన విమోచనా బంధువుగా ఉండుటకు యోగ్యుడు.

(2) ఆయన చెల్లించుటకైన క్రయధనం ఆయన యొద్ద ఉన్నది. ఆయన మనలను పాపము నుండి వెలపెట్టి కొనుటకు కావలసినది ఉన్నది. అది ఏమి. ఆయన రక్తము. ఈ విషయమే లేవీయకాండములో పేర్కొనబడినది మరల హెబ్రీయులకు 9:22లో విశదీకరించబడినది: "రక్త ప్రోక్షణ లేకుండా పాపక్షమాపణ లేదు." తన కొరకు ఆయన చెల్లించవలసిన పాపపు ఋణము ఏదియు లేదు, మన ఋణమును తీర్చుటకు క్రీస్తు తన రక్తమును చెల్లించెను.

(3) మన కోసము ఆయన వెల చెల్లించ యిష్టపడెను. "నేను దాని మరల తీసికొనునట్లు నా ప్రాణము పెట్టుచున్నాను; ఇందు వలననే నా తండ్రి నన్ను ప్రేమించుచున్నాడు. ఎవడును నా ప్రాణము తీసికొనడు; నా అంతట నేనే దాని పెట్టుచున్నాను; దాని పెట్టుటకు నాకు అధికారము కలదు, దాని తిరిగి తీసికొనుటకును నాకు అధికారము కలదు; నా తండ్రివలన ఈ ఆజ్ఞ పొందితిననెను" అని యోహాను 10:17, 18లో చదువుదుము.

యేసు మనలో ఒకడుగా ఉన్నాడు. తన వద్ద విమోచనా క్రయధనము ఉన్నది మరియు దానిని మన కొరకు వినియోగించటానికి సిద్ధపడెను. ఎంత గొప్ప విమోచకుడు!

*విమోచింపబడినవారు.* 7వ వచనములో, "ఆయన యందు మనకు విమోచనము ..." అని ఉంది. "మనకు" అనునది ఎవరు? అది 4వ వచనములోనున్న "ఆయనయందు ఉన్న మనము." నిత్యత్వములో దేవుడు ఏర్పరచుకొనిన వారిని ఇప్పుడు దేవుడు విమోచించుచున్నాడు. ఎవరిని తన శరీరములో భాగము అవుటకు, మరియు విమోచించట -నికి ఎన్నుకొన్నాడు? ఎందరైతే క్రీస్తు నందు ఉందురో వారినందరిని. మీరు క్రీస్తునందు ఉన్నట్లయితే మీరు పాపము యొక్క అధికారము మరియు శిక్షనుండి విమోచింపబడినవారిని ఎరుగవచ్చు. పాపము యొక్క బంధకమునుండియు మరియు శిక్షావిధినుండియు విడిపింపబడుటకు సంపూర్ణమైన వెల చెల్లించబడియున్నది. నీవు పరలోకమునకు బంధింపబడియున్నావు.

*వెల.* విమోచనము ఎన్నడు చౌకగా లభించదు. విమోచింపబడిన దాని విలువతో విడిపించుటకు చెల్లించునది సమానముగా ఉండవలెను. 7వ వచనం ఇలా కొనసాగుతుంది, "ఆయన రక్తము ద్వారా మనకు విమోచనము ..." మీరు పాపము నుండి విడుదల పొందుటకు క్రీస్తు రక్తము వెలాయెను. అది చెల్లించకుండా మన పాపములకు క్షమాపణ లేదు. దాని కంటే తక్కువైనదేదీ కార్యమును సిద్ధింప చేయలేదు.

పాతనిబంధన క్రింద జంతువుల రక్తము శుద్ధీకరణకు చిహ్నము. అయితే మానవుని నిత్య విడుదలకు మానవుని రక్తము మాత్రమే ఆ కార్యమును చేయగలదు.

> అయితే క్రీస్తు రాబోవుచున్న మేలులవిషయమై ప్రధానయాజకుడుగా వచ్చి, తానే నిత్యమైన విమోచన సంపాదించి, హస్తకృతము కానిది, అనగా ఈ సృష్టి సంబంధము కానిదియు, మరి ఘనమైనదియు, పరిపూర్ణమైనదియునైన గుడారముద్వారా, మేకలయొక్కయు కోడెలయొక్కయు రక్తముతో కాక, తన స్వరక్తముతో ఒక్కసారే పరిశుద్ధస్థలములో ప్రవేశించెను (హెబ్రీయులకు 9:11, 12).

దేవుని న్యాయమైన పరిశుద్ధమైన చట్టము, పాపము వలన వచ్చు జీతము మరణమని చెప్పెను. నాకు నా సొంత పాపములు ఉన్నవి గనుక మీ కొరకు నేను మరణించలేను; అదేవిధముగా మీకు మీ సొంత పాపములు ఉన్నవి గనుక మీరు నా కొరకు మరణించలేరు. దేవుని న్యాయము నిమిత్తమై సిలువలో యేసు తన నిర్దోషమైన రక్తమును చిందించుట చేత ఆయన పరిపూర్ణమైన విమోచకునిగా ఉండెను. మనము ప్రతి ఆదివారము ప్రభురాత్రి భోజనమును ఆచరించుట చేత మన విమోచనము కొరకు చెల్లింపబడిన గొప్ప వెలను జ్ఞాపకము చేసుకొందుము.

*ఫలితము.* మనము విమోచించబడిన తరువాత ఏమి జరుగును? "ఆయన రక్తమువలన మనకు విమోచనము, అనగా మన అపరాధములకు క్షమాపణ మనకు కలిగియున్నది ..." (1:7). సంపూర్ణముగా క్షమింపబడుట విమోచనము వలన వెంటనే కలుగు ఫలితం. మీ యొక్క ఆత్మ అగాధ లోయలలో ఈ సత్యమును గ్రహించుడి, అప్పుడు మీరు అమితమైన ఆనందం కలిగి ఉందురు!

దేవుడు మనలను క్షమించుటకు కేకలు వేస్తున్నాడని కలవారి కథ చెబుతున్నది. సిలువలో మన విమోచకుని మరణము ద్వార మన పాపములకు విమోచనము అందించుట

దేవుని ఆలోచన. చివరి భోజన సమయమందు యేసు తనను గూర్చి ఈ విధముగా చెప్పెను, "... అనేకుల పాపముల కొరకు ప్రోక్షింపబడుచున్న నిబంధన రక్తము ..." (మత్తయి 26:28).

ఈ విషయమును ఇశ్రాయేలీయులు గ్రహించిరి. మహాగొప్ప ప్రాయశ్చిత్త దినమందు రెండు మేకలు ఉండును (లేవీయకాండము 16:8). ఒక మేక వధింపబడి దాని రక్తము ప్రత్యక్ష గుడారములోనున్న కరుణా పీఠముపై చిలకరింపబడును. ఆ రక్తము పాపములకు నష్టపరిహారము. తరువాత, ప్రధాన యాజకుడు తన చేతులను వేరొక మేకపై పెట్టి ఇశ్రాయేలీయుల పాపములను ఒప్పుకొనును. ఆ మేక పై వారి పాపములను దాని పై మోపినట్టున్నది. అప్పుడు ఆ మేకను మరలా తిరిగి రాకుండా అరణ్యములోనికి పంపివేయుదురు (లేవీయకాండము 16:21).

*కారణము.* దేవుడు మనకోసము దీనినంతా ఎందుకు చేయాలి? ఆయన క్రియల వెనుక ఉన్న కారణము ఏమిటి?

> మనకు సంపూర్ణమైన జ్ఞానవివేచన కలుగుటకు, ఆ కృపను మనయెడల విస్తరింపజేసెను. ఈ సంకల్పమునుబట్టి ఆయన పరలోకములో ఉన్నవే గాని, భూమిమీద ఉన్న వేగాని, సమస్తమును క్రీస్తునందు ఏకముగా సమకూర్చవలెనని తనలోతాను నిర్ణయించుకొనెను ... (1:9, 10).

కారణము ఐక్యత. దేవుడు సమస్త సృష్టిని తనతో సమాధానపరచుకొని సహవాసమును ఏర్పరచాలని కోరుకొనెను. ఏదెను తోటలో ఆదాము హవ్వ పాపము చేసి ఆ సహవాసమును భంగము చేసుకొనిరి; యేసు మాత్రము దేవునికి మానవునికి అడ్డుగా ఉన్న పాపమను అడ్డు గోడను సిలువ ద్వారా తొలగించెను. మరలా సృష్టి కర్త మరియు సృష్టియు అద్భుతమైన సహవాసమును అనుభవించుదురు.

*ముగింపు.* మన జీవితములు ఒకప్పుడు పాపము చేత చెడిపోయి ఉన్నవి. మనము దేవునికి దూరము చేయబడ్డాము, కాని తన కృప ద్వార మన పాపపు సమస్య జయించబడినది. క్రైస్తవులుగా, మనము సంపూర్ణమైన జీవితమును మరియు దేవుని సహవాసమును ఉచితముగా అనుభవించుచున్నాము. పరలోకమునకు బంధింపబడిన మనము, కొంత పరలోకమును ఇక్కడే అనుభవించుదుము.

## మన స్వాస్థ్యమునకు ఆధారము (1:10–13)

మనము దేవుని వాగ్దానములను ఎట్లు పొందగలము? మనము ఎట్లు ఆయన వారసులగుదుము? ఎఫెసీయులకు 1:10, 11, 12లో, "... ఆయనయందు స్వాస్థ్యముగా ఏర్పరచెను." "నిర్ణయించెను" లేక "ఏర్పరచెను" (NIV) అనే 4వ వచనములోని గ్రీకు పదమునకు "ఏర్పరచెను" అని తర్జుమా చేసిన పదముకాక వేరొక పదమై యున్నది. "స్వాస్థ్యము" అని తర్జుమా చేయబడిన నామవాచకమునకు పౌలు క్రియాపదమును క్రొత్తనిబంధనయందంతట ఉపయోగించాడు. కావున స్వాస్థ్యమును పొందుటకు మనము ఏర్పరచబడియున్నామని అతడు విశేషముగా చెప్పాడు.

మనము ఈ స్వాస్థ్యమును ఎక్కడ పొందటానికి ఏర్పరచబడినాము? పౌలు అది

"ఆయన యందు" అనగా "క్రీస్తు నందు" అని చెప్పాడు. 3వ వచనము ప్రకారము ప్రతి ఆత్మ సంబంధమైన ఆశీర్వాదము దొరుకు స్థలమదే. నిత్యత్వము నుండి ఏర్పరచబడిన దేవుని స్వాస్థ్యము ఎవరైతే క్రీస్తుతో సహవాసము కలిగి ఉంటారో వారికి చెందుతుంది. ఆయనకు వెలుపల, దేవుని నుండి మనము దేనిని ఆశించకూడదు.

*ఎప్పుడు ఇది జరుగుతుంది?* ఆత్మీయముగా దివాళా తీసిన మానవునికి ఈ ప్రశ్న కంటె క్లిష్టమైన మరొక ప్రశ్న లేదు: "నేను క్రీస్తు నందు ఎట్లు ప్రవేశించగలను?" మరియు "దేవుని వాగ్దానములకు నేను ఎట్లు వారసుడగుదును?"

పాపి క్రీస్తుకు వెలుపల ఉన్నాడు. మరి ఎప్పుడు ఆ పాపి వెలుపల నుండి *క్రీస్తు లోనికి* వచ్చును? బాప్తిస్మము వద్ద జరుగునని పౌలు స్పష్టముగా చెప్పెను: "*క్రీస్తు లోనికి బాప్తిస్మము* పొందిన మీరు ఆయన మరణము లోనికి బాప్తిస్మము పొందిరని ఎరుగరా?" (రోమీయులకు 6:3; నొక్కబడినది చేర్చినది). ఒక వ్యక్తి బాప్తిస్మము పొందినప్పుడు దేవుడు వానిని తన కుమారుని యందు ఉంచి తన ఐశ్వర్యమునకు వారసునిగా చేయును.

"యేసుక్రీస్తునందు మీరందరు విశ్వాసమువలన దేవుని కుమారులై యున్నారు. క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిన మీరందరు క్రీస్తును ధరించుకొనియున్నారు" అని పౌలు చెప్పాడు (గలతీయులకు 3:26, 27; నొక్కడం చేర్చినది). ఇక్కడ కూడా ఒకే విధమైన ఆలోచన కనిపిస్తున్నది. ఎప్పుడు దేవుడు మనలను క్రీస్తునందు ఉంచెను? మనము క్రీస్తును ఎప్పుడు ధరించుకొన్నాము? మనము ఆయనలోనికి బాప్తిస్మము పొందినప్పుడు జరిగెను. యేసు ఆజ్ఞాపించిన విధముగా నీటి బాప్తిస్మములో పాలుపొందినప్పుడు దేవుడు మనలను తన వారసులుగా చేయు ఒక చారిత్రక ఘట్టము సంభవించును. ఒకవేళ నీవు క్రొత్తనిబంధన ఆజ్ఞాపించిన విధముగా బాప్తిస్మము పొందినట్లయితే నీవు క్రీస్తులో ఉన్నట్లే మరియు ఆయనతో సమానవారసుడివే. ఒకవేళ అలా చేయనట్లయితే, తప్పించుకోలేని పరిస్థితిని ఎదుర్కోనవలసినదే: ఒకవేళ నీవు క్రీస్తునందు లేనట్లయితే దేవుని స్వాస్థ్యములో నీకు పాలు లేదు.

*ఎవరికి ఇవన్ని సంభవించును?* 1:12, 13 ఆధారము చేసుకొని, దేవుని మర్మ శరీరములో ఉన్నా ప్రజలందురు స్వాస్థ్యమును పొందుదురని పౌలు చెప్పెను:

> దేవుడు తన చిత్తప్రకారమైన సంకల్పమునుబట్టి మనలను ముందుగా నిర్ణయించి, ఆయన యందు స్వాస్థ్యముగా ఏర్పరచెను. ఆయన తన చిత్తానుసారముగా చేసిన నిర్ణయముచొప్పున సమస్త కార్యములను జరిగించుచున్నాడు. మీరును సత్యవాక్యమును, అనగా మీ రక్షణ సువార్తను విని, క్రీస్తునందు విశ్వాసముంచి, వాగ్దానము చేయబడిన ఆత్మచేత ముద్రింపబడితిరి.

యూదుడైనా, అన్యుడైనా, పురుషుడైనా, స్త్రీయైన, దాసుడైనా, స్వతంత్రుడైనా, ధనవంతుడైనా, దరిద్రుడైనా – ప్రతిఒక్కరికి స్వాస్థ్యము పొందుటకు ఒక్కటే ఆధారము. వారసుడు *క్రీస్తు నందు* ఉండవలెను. ఒక వ్యక్తి ఇంకొక వ్యక్తి మాదిరిగానే సమానముగా అంగీకరించబడుదురు – కాని ప్రతి ఒక్కరు క్రీస్తులోనే అంగీకరించబడుదురు.

### దేవుని వాగ్దానములు (1:11–14)

వాగ్దానాలు, వాగ్దానాలు, వాగ్దానాలు! అటువంటివి కొన్ని వేల కొలది ఎవరు వినలేదు?

ప్రచారకర్తలు, ప్రభుత్వాలు, భర్తలు, భార్యలు, సహోదరి సహోదరులు, కుమారులు కుమార్తెలు, అందరు వాగ్దానాలు చేసినను నిలుపుకోనివారుగా ఉంటారు. అయితే తన వాగ్దానములను నిలుపుకొనువారు ఒకరు ఉన్నారు. "వాగ్దానములను చేసినవాడు నమ్మదగినవాడు" (హెబ్రీయులకు 10:23); "... దేవుడు వాగ్దానము చేసినవి, ఆయన నెరవేర్చుటకు సమర్థుడు" (రోమీయులకు 4:21; చూడు 2 పేతురు 3:9).

నిత్యత్వములో, సమయము ఆరంభము కాక మునుపు, దేవుడు తన కుమారునిలో విశ్వాసులందరు ఒక్క శరీరముగా ఉండవలెననే ఒక ఆలోచనను రూపొందించెను. ఆయన తన కుమారుని రక్తమును కల్వరిలో చిందించుట చేత ఆ శరీరమును ఉనికి లోనికి తెచ్చెను. దేవుడు ఆయన శరీరములో ఉన్నవారిని ఏర్పరచుకొని, విమోచించుటకు నిర్ణయించుకొనినప్పుడు, మరణము, అపజయము లేకుండా నిత్య జీవముతో పాటు ఆయన కొన్ని అద్భుతమైన వాగ్దానములు చేసెను. ఆ వాగ్దానముల నెరవేర్పే క్రైస్తవ స్వాస్థ్యము – అదే సంఘము అనబడిన దేవుని శరీరము యొక్క భవిష్యత్తు.

"దేవుని వాగ్దానములు ఎన్నియైనను అవి క్రీస్తునందు అవును అన్నట్లుగానే ఉన్నవి" (2 కొరింథీయులకు 1:20). దేవుడు ఆయన చేసిన వాగ్దానముల విషయములో వెనుదీయడు.

**ఆత్మ చేత ముద్రింపబడుట (1:13)**

దేవుని వాగ్దానములు మనము పొందుతామని మనము ఎట్లు చెప్పగలము? 13వ వచనము యిలా చెప్పుతుంది, "... మీరు వాగ్దానము చేయబడిన ఆత్మ చేత ముద్రింపబడితిరి." దేవుడు ఆ వాగ్దానములకు బజానాగా తన పరిశుద్ధాత్మను మన హృదయములలో ఉంచెను. ఇదే విధమైన దేవుని ముద్ర గూర్చి పౌలు 2 కొరింథీయులకు 1:21, 22 మరియు ఎఫెసీయులకు 4:30లో మాటలాడెను. దేవుడు మనలను ఆయన శరీరములో ఉంచినప్పుడు – అనగా మనము క్రీస్తులోనికి బాప్తిస్మము పొందినప్పుడు – దేవుడు తన దైవికమైన ముద్రను మనపై వేసెను. ఆ ముద్రే పరిశుద్ధాత్మ.

ముద్రింపబడుట అనగా ఏమిటి? బైబిలు కాలములో ముద్రకు నాలుగు అర్థములు కలవు.

*ప్రామాణికత.* ముద్ర వేయుట అంటే, నిజమైనది అని ధృవీకరించుట. 1 రాజులు 21లో యెజెబెలు తన భర్తయైన ఆహాబు రాజు కొరకు నాబోతు యొక్క ద్రాక్ష తోటను దక్కించు కొనుటకు పన్నాగము వేసెను, తన పన్నాగమును నిజముగా అధికారికమైనదిగా ఉండునట్లు "ఆహాబు పేరుమీద రెండు పత్రికలు వ్రాసి వాటిని ఆయన ముద్ర చేత ముద్రించెను" (1 రాజులు 21:8). ముద్ర వాస్తవిక అధికార చిహ్నమును సూచిస్తున్నది.

దేవుని నిజమైన కుమారులమని, ఆయన వాగ్దానములకు వాస్తవ వారసులమని మనకు ఎట్లు తెలియును? పౌలు ఏమంటున్నాడంటే, మనలో ఉన్న పరిశుద్ధాత్ముడే దేవుని వ్యక్తిగతమైన ప్రామాణికత ముద్ర (రోమీయులకు 8:9).

*యజమానత్వ.* బైబిలు కాలములో ముద్ర యజమానత్వమును నిరూపించుటకు వాడబడినది. యిర్మీయా ద్వారా దేవుడు ఇశ్రాయేలును నాశనము చేతునని చెప్పిన తరువాత వారు 70 సంవత్సరములు చెరలో ఉండి వత్తురని జ్ఞాపకము చేసెను. ఇది భూమి

కొనుగోలు చేయుటకు సువర్ణ అవకాశముగా ఉన్నది! ప్రవక్త ఈ విధముగా వ్రాసెను, "హనమేలు వద్దనుండి అనతోతులో ఒక పొలము కొంటిని ... క్రయ పత్రము వ్రాసి ముద్ర వేసి సాక్షులను పిలిపించి త్రాసుతో ఆ వెండి తూచి క్రయ పత్రమును, అనగా ముద్ర గల కైకోలును ఒడంబడికను ..." (యిర్మీయా 32:9, 10; నొక్కడం చేర్చినది). యిర్మీయా వంశస్థులు 70 సంవత్సరములు తరువాత ఆ ముద్రను పగుల గొట్టి ఆ క్రయ పత్రమును చూపి ఆ స్థలము పై తమ యజమానత్వమును నిరూపించారు. ముద్ర వ్యవహారము ముగిసిన దానిని సూచిస్తున్నది.

పరిశుద్ధత్మ ముద్ర, మన విమోచనా క్రయధనము సంపూర్ణముగా చెల్లించబడి, ఇప్పుడు దేవుని సొత్తయి ఉన్నామని సూచిస్తున్నది. మనము వెల పెట్టికొనబడి, మనము ఆయన వారమని నిరూపించుటకు ముద్ర వేయబడితిమి.

*భద్రత.* ముద్ర భద్రతా యొక్క ఉద్దేశము కొరకు వాడబడును. దానియేలు సింహపు బోనులో వేయబడినప్పుడు దాని ద్వారము చుట్టు మైనము పోసి దాని పై రాజు కాని లేదా ఆయన అధికార ముద్ర వేసి ఉండవచ్చు. దానిపై ఉన్న చిహ్నము అధికార చిహ్నము. ద్వారము భద్రపరచబడిన తరువాత కేవలము అర్హత ఉన్న వారే దానిని తెరుచుటకు యోగ్యులు.

అదే విధముగా, యేసు మరణము తరువాత యూదులు ఆయన సమాధికి ముద్ర వేసి భద్రపరచిరి. అది ఆయన శిష్యులు దొంగిల కుండా ఉండుటకు చేసిన ప్రయత్నము.

దేవుడు ఒక విమోచింపబడిన జీవితమును తీసికొని పరిశుద్ధాత్మతో ముద్రించినప్పుడు ఆ ముద్రను విరగగొట్టుటకు ఎవరికి అధికారము కలదు? ఎవ్వరి వలన కాదు! మన స్వాస్థ్యము భద్రముగా ఉన్నది.

*ప్రాతినిధ్య అధికారము.* ముద్రకు ఉన్న చివరి ఉపయోగము, ప్రాతినిధ్య అధికారము చూపించుటకు అనగా, ఇంకొకరి తరుపున అధికారికముగా వ్యవహరించుట. ఎస్తేరు గ్రంథములో దీనికి ఒక ఉదాహరణ ఉన్నది: "రాజు తన చేతి ఉంగరము తీసి దానిని ... హామానునకిచ్చెను" (ఎస్తేరు 3:10).

మొర్దెకైని మరియు తక్కిన యూదులను హతమార్చవలెనని హామాను పన్నాంగము పన్నెను. రాజుకు యూదుల వలన రాజ్యమునకు ముప్పని అబద్ధము చెప్పెను. అప్పుడు రాజు హామానుకు తన చేతి ఉంగరము నిచ్చి రాజు పేరట తన కిష్టము వచ్చినట్లు చేయుమనెను. తరువాత హామాను యొక్క పన్నాగము బయట పడిన తరువాత అదే విధమైన అవకాశమును మొర్దెకైకి లభించెను. రాజు ఈ విధముగా మొర్దెకైకి సెలవిచ్చెను,

> అయితే రాజు పేరట వ్రాయబడి రాజు ఉంగరముతో ముద్రింపబడిన తాకీదును ఏ మానవుడును మార్చజాలడు; కాగా మీకిష్టమైనట్లు మీరు రాజునైన నా పేరట యూదుల పక్షమున తాకీదు వ్రాయించి రాజు ఉంగరముతో దాని ముద్రించుడి (ఎస్తేరు 8:8).

మొర్దెకైకి తన ముద్ర ఇచ్చుట ద్వారా, రాజు సంపూర్ణ ప్రాతినిధ్య అధికారమును రాజరికపు పేరుతో వ్యహరించడానికి అనుమతించెను.

ఇదంతా విశ్వాసులతో ఏమి సంబంధము? యోహాను 16:23లో యేసు తన అపొస్తలులకు పరిశుద్ధాత్మ పొందుదురని చెప్పిన తరువాత, ఆయన నామమున సమస్తమును

జరిగించుటకు యేసు వారికి వాగ్దానము ఇచ్చెను. దేవుని పరిశుద్ధాత్మ మన పై ఉండుట వలన – దైవ ముద్ర మన పై ఉండుట వలన – యేసు అందించిన ప్రాతినిధ్య అధికారము వలన మనము తండ్రిని ఏదైనను అడుగవచ్చు.

దేవుడు మనకు వాగ్దానము చేసినది పొందుదము అను భరోసా వారసులుగా ఆయన మనకు ఇచ్చిన పరిశుద్ధాత్మే ఆధారము. "దేవుని మహిమకు కీర్తి కలుగుటకై ఆయన సంపాదించుకొనిన ప్రజలకు విమోచనము కలుగు నిమిత్తము ఈ ఆత్మ మన సంచకరువుగా ఉన్నాడు" (ఎఫెసీయులకు 1:14). దేవుడు తాను ఏర్పరచు కొనినవారికి కొంత స్వాస్థ్యమును ఇప్పుడే ఇచ్చి; మనలో ఉన్న పరిశుద్ధత్మాను దేవుడు ముందు చెల్లింపుగా యిచ్చెను, మిగతాది పూర్తిగా తరువాత ఇచ్చును. దేవుడు ఆత్మను మనకు ఇచ్చినది మనము ఆయన సొత్తని చెప్పుటకు మాత్రమే కాక ఆయన చేసిన వాగ్దానములన్నిటిని పొందుదుమని నమ్మించుటకు యిచ్చెను.

*ముగింపు.* మన విమోచనమే దేవుని చివరి గమ్యము. మనము పాపము యొక్క శిక్షనుండి మరియు అధికారము నుండి విడుదల పొందితిమి, ఒక దినాన మనము పాపము యొక్క సానిధ్యము నుండి విడుదల పొందబోతాము. ఇప్పుడు మన ఆత్మలు విమోచింపబడ్డాయి, ఒక దినాన మన శరీరములు అక్షయముగా లేపబడతాయి. అప్పుడు మన విమోచనము సంపూర్ణమవును (చూడు రోమీయులకు 8:23). దేవుడు మనకు విడుదలను యిచ్చి, అమర్త్యతతో కూడిన శరీరములయందు ఆయన ఐశ్వర్యముతో కూడిన స్వాస్థ్యమును నిత్యత్వమంతటిలో అనుభవించెదము. మనకు వాగ్దానము చేయబడినది పొందుదము!

నిత్యత్వము నుండి నిత్యత్వమునకు మనము క్రీస్తునందు కుమారులుగా ఎన్నుకొన్నబడినవారము. ప్రస్తుతమందు మనము పాపము నుండి విడుదలపొంది, క్రీస్తు యొక్క సారూప్యములోనికి మార్చబడుటకు స్వాతంత్రులమైయున్నాము. రాబోవు నిత్యత్వములో మనకు దేవుని ఐశ్వర్యము చొప్పున ఒక స్వాస్థ్యము ఉంచబడినది. ఇది అంతయు మనలను ఎంపికచేసుకొనిన దానికి ఫలితముగా మన అత్యద్భుతమైన దేవుని మహిమకు కీర్తి కలుగునట్లు జరుగును.

క్రిస్ బుల్లర్డ్

**వాగ్దానముచే ముద్రింపబడుట (1:13)**

దేవుడు క్రైస్తవులను పరిశుద్ధాత్మ వాగ్దానముతో ముద్రించెను, కాని వాస్తవముగా అది ఏమిటి?

1. క్రైస్తవులుగా మనము పూర్తి స్వాస్థ్యమును పొందుదుము.
2. దేవుడు మనలను ఏమి తెలుసుకోవాలనుకొంటున్నాడో, ఆయన మనలను ఏమి చేయమని చెబుతున్నడో, అది అంతరంగ పురుషుని యందు శక్తి కలిగి ఆయన ఆత్మ వలన బలపర్చబడుట వలన గ్రహించుకొనగలము (3:16–21).
3. మనము పరిశుద్ధాత్మ ఫలము ఫలించుదము (గలతీయులకు 5:22, 23).
4. శరీరమును జయించి నిజమైన సంతోషమును అనుభవించుదము (రోమీయులకు 8:13).

5. మరణము నుండి పునరుత్థానము పొందుదము (రోమీయులకు 8:11).
6. ఆపదలలో సహాయము పొందుదము (రోమీయులకు 8:26, 27).
7. మనము యేసు చేతులలో క్షేమముగా ఉందుము.

యోహాను 10:27, 28లో యేసు ఒక అద్భుతమైన వాగ్దానము చేసి ఈ విధముగా చెప్పెను, "నా గొర్రెలు నా స్వరము వినును, నేను వాటి నెరుగుదును, అవి నన్ను వెంబడించును. నేను వాటికి నిత్యజీవము నిచ్చుచున్నాను గనుక అవి ఎన్నటికిని నశించవు, ఎవడును వాటిని నా చేతిలో నుండి అపహరింపడు." "వినును," "ఎరుగును," "వెంబడించును," మరియు "యిచ్చును" అను క్రియాపదలన్నియు గ్రీకులో వర్తమాన కాలంలో జరిగించు కార్యమును సూచించు పదములైయున్నవి, అంటే "మాట్లాడువారు ప్రతిపాదన చేస్తుండగా జరిగిన దానిని" సూచిస్తుందని అర్థము.[88] అది "ఆ కార్యము ముందుకు కొనసాగుచున్నదానిని" తెలుపుతుంది.[89] కావున యేసు "నా గొర్రెలు నా స్వరమును వింటూ ఉంటాయి, మరియు నేను వాటిని ఎరుగుతూ ఉంటాను, మరియు అవి నన్ను వెంబడిస్తూనే ఉంటాయి; నేను వాటికి నిత్యజీవమును యిస్తూనే ఉంటాను; మరియు అవి ఎన్నటికిని నశించవు" అని చెప్పెను. ఎన్నడు నశించరు అను వాగ్దానము వింటూ వెంబడిస్తూ ఉన్నా గొర్రెలకే. ఏ గొర్రెయైతే వింటూ వెంబడించడం మానుకుంటుందో, అది వాగ్దానము నుండి మరియు దాని ముద్రింపబడిన భద్రతనుండి దూరమగును. మనకు క్రీస్తులో భద్రత లేదు అని చెప్పినట్లయితే, మనము ఆయన వాగ్దానములను లెక్కచేయకపోవుటయే. వాగ్దానము చేయబడి భద్రత షరత్తులు లేనిదని చెప్పినయెడల ఇక్కడ వాడిన క్రియాపదాలను నిర్లక్ష్యపెట్టినట్టే. క్రైస్తవునికి భద్రత ఉన్నదా? తప్పక ఉన్నది! ఆయన భద్రత షరత్తులు లేనిదా? నిశ్చయముగా లేదు!

**మన ఆశీర్వాదములను ధ్యానించుట**

మనము క్రైస్తవ జీవితమును జీవిస్తుండగా మన ఆశీర్వాదములను లెక్కించుకొందాము ...

- దేవుడు మనలను విస్తారముగా దీవించిన విషయములను ఆలోచించుకొందాము.
- మనము ఈ లోకములో నివసిస్తున్నప్పుడు పొందు ఆశీర్వాదములను ధ్యానించుకొందాము.
- అన్నింటికంటే శ్రేష్టమైన "క్రీస్తునందు" ఉన్న ఆత్మ సంబంధమైన ఆశీర్వాదములను సర్వేక్షణ చేయుదుము. ఈ ఆశీర్వాదములు ఆత్మసంబంధమైన, సమృద్ధిగల మరియు నిత్య జీవమును అనుగ్రహించును.

నీవు "క్రీస్తునందు" అనగా, ఆత్మ సంబంధమైన ప్రతి ఆశీర్వాదము దొరుకు చోటున ఉన్నావా?

జే లాక్హార్ట్

సూచనలు

[1]Ethelbert W. Bullinger, *A Critical Lexicon and Concordance to the English and Greek New Testament* (London: Samuel Bagster and Sons, n.d.; reprint, Grand Rapids, Mich.: Zondervan Publishing House, Regency Reference Library, 1975), 104. [2]Marvin R. Vincent, *Word Studies in the New Testament,* vol. 3, *The Epistles of Paul* (N.p.: Charles Scribner's Sons, 1890; reprint, Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1946), 364. [3]Albert Barnes, *Notes on the New Testament: Ephesians, Philippians and Colossians,* ed. Robert Frew (Grand Rapids, Mich.: Baker Book House, 1965), 16. [4]Paul T. Butler, *The Gospel of John,* vol. 1, Bible Study Textbook Series (Joplin, Mo.: College Press, 1961), 21. [5]Homer Hailey, *That You May Believe: Studies in the Gospel of John* (Grand Rapids, Mich.: Baker Book House, 1973), 20. [6]Adapted from Gerald F. Hawthorne, *Philippians*, Word Biblical Commentary, vol. 43 (Waco, Tex.: Word Books, 1983), 84. [7]Spiros Zodhiates, ed., *The Complete Word Study New Testament,* 2d ed. (Chattanooga, Tenn.: AMG Publishers, 1992), 937, 963. [8]R. C. H. Lenski, *The Interpretation of St. Paul's Epistles to the Galatians, to the Ephesians and to the Philippians* (Columbus, Ohio: Wartburg Press, 1946; reprint, Minneapolis: Augsburg Publishing House, 1961), 392. [9]T. R. Applebury, *Studies in Second Corinthians,* Bible Study Textbook Series (Joplin, Mo.: College Press, 1971), 19. [10]Walter Bauer, *A Greek-English Lexicon of the New Testament and Other Early Christian Literature,* 3d ed., rev. and ed. Frederick William Danker (Chicago: University of Chicago Press, 2000), 388.

[11]Ibid., 305. [12]D. L. Moody; quoted in Ruth Paxson, *The Wealth, Walk and Warfare of the Christian* (Old Tappan, N.J.: Fleming H. Revell Co., 1939), 31. [13]Kenneth S. Wuest, *Wuest's Word Studies from the Greek New Testament for the English Reader: Ephesians and Colossians* (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1953), 31; Bauer, 515 కూడ చూడు. [14]Wuest, 31; see also Bauer, 561. [15]Andrew T. Lincoln, *Ephesians,* Word Biblical Commentary, vol. 42 (Dallas: Word Books, 1990), 24. [16]Wuest, 33. [17]S. D. F. Salmond, "The Epistle to the Ephesians," in *The Expositor's Greek Testament,* ed. W. Robertson Nicoll (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1967), 3:249. [18]Wuest, 33–34. [19]Salmond, 250. [20]Lenski, 360.

[21]Salmond, 251. [22]Robert Young, *Young's Analytical Concordance to the Bible,* 22d American ed., rev. Wm. B. Stevenson (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., n.d.), 14. [23]T. S. Rees, "Adoption," in *The International Bible Encyclopedia,* ed. James Orr (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1960), 1:58. [24]Salmond, 251. [25]Ibid., 250–51. [26]Emmet Russell, "Adoption," in *The Zondervan Pictorial Bible Dictionary,* ed. Merrill C. Tenney (Grand Rapids, Mich.: Zondervan Publishing House, 1963), 15. [27]Wuest, 36. [28]Ibid., 36–37. [29]Kenneth S. Wuest, *Wuest's Word Studies from the Greek New Testament for the English Reader: Galatians* (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1953), 115. [30]Wuest, *Ephesians and Colossians,* 37.

[31]Ibid. [32]Salmond, 252. [33]George V. Wigram, *The Englishman's Greek Concordance of the New Testament,* 9th ed. (London: Samuel Bagster and Sons, 1903), 322. [34]Vincent, 365. [35]Lincoln, 27. [36]Zodhiates, 631, 863. అనిర్దిష్ట కాలము గతములో జరిగిన క్రియను సూచిస్తుంది. [37]Ibid., 631, 869. [38]Bauer, 117. [39]Lenski, 366; see also Bauer, 156. [40]Bauer, 770; Salmond, 255; Lenski, 367.

[41]Salmond, 255. [42]Wuest, *Ephesians and Colossians,* 41. [43]Ibid. [44]Salmond, 256. [45]Bauer, 805. [46]Salmond, 257. [47]G. W. Barker, "Mystery," in *The International Standard Bible Encyclopedia,* rev. ed., ed. Geoffrey W. Bromiley (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1986), 3:451–52. [48]Wuest, *Ephesians and Colossians,* 44; see also Bauer, 447. [49]Bauer, 511. [50]Ibid., 404.

[51]Wuest, *Ephesians and Colossians,* 44. [52]Ibid.; see also Bauer, 697.36 [53]Lincoln, 31. [54]Bauer, 830, 497. [55]C. G. Wilke and Wilibald Grimm, *A Greek-English Lexicon of the New Testament,* trans. and rev. Joseph Henry Thayer (Edinburgh: T. & T. Clark, 1901; reprint, Grand Rapids, Mich.: Baker Book House, 1977), 673. [56]John McClintock and James Strong, eds., "Fulness," in *Cyclopedia of Biblical, Theological, and Ecclesiastical Literature* (Grand Rapids, Mich.: Baker Book House, 1970), 3:692. [57]Salmond, 260. [58]Bauer, 65. [59]Zodhiates, 886. [60]Salmond, 261.

[61]Henry Alford, *The Greek Testament,* vol. 3, *Galatians - Philemon,* 4th ed. (Cambridge: Deighton, Bell, and Co., 1865), 76. [62]Lincoln, 33. [63]Zodhiates, 928; see also Bauer, 548. [64]Salmond, 263. [65]Lincoln, 35–36. [66]క్రీ.శ. రెండవ శతాబ్దములో ఐగుప్తునందు హెబ్రీలోని పాత నింబధన గ్రీకులోనికి తర్జుమా చేయబడినదే సెప్టుజంటు.. [67]Bauer, 869. [68]See John McClintock and James Strong, eds., "Purpose of God," in *Cyclopedia of Biblical, Theological, and Ecclesiastical Literature* (Grand Rapids, Mich.: Baker Book House, 1970), 8:815. [69]Zodhiates, 897. [70]Wigram, 361–62.

[71]Zodhiates, 897. [72]Wuest, *Ephesians and Colossians,* 48. [73]Salmond, 265–66; Wuest, *Ephesians and Colossians,* 48; Vincent, 368–69. [74]Lenski, 380; Lincoln, 37. [75]Lenski, 382. [76]Thayer, 26. [77]Bullinger, 339. [78]Lenski, 383. [79]"Sealed," in *The New Schaff-Herzog Encyclopedia of Religious Knowledge,* ed. Samuel Macauley Jackson (Grand Rapids, Mich.: Baker Book House, 1951), 1:248. [80]Kirsopp Lake, trans., *The Apostolic Fathers,* The Loeb Classical Library, ed. T. E. Page, et al. (Cambridge, Mass.: Harvard University Press, 1913), 1:141, 2:263.

[81]Zodhiates, 893. [82]Lincoln, 41. [83]Ibid., 42. [84]William D. Mounce, *Pastoral Epistles,* Word Biblical Commentary, vol. 46 (Nashville: Thomas Nelson Publishers, 2000), 529. [85]Ibid. [86]గ్రీకును పదమునకు పదమును 7, 11 మరియు 13వ వచనములో తర్జుమా చేస్తే "ఎవరి యందు" అను అర్థము నిచ్చును. [87]నానా సమయములలో, నానా ప్రదేశములలో గౌరవ ప్రదమైన బైబిలు పండితులు దేవుడు ముందుగానే ఏర్పరచుట అను బోధకు సంబంధించిన ప్రశ్నను తర్కించిరి. వీరిలో, ఉత్తర ఆఫ్రికా హిప్పోకు చెందిన 4వ శతాబ్దపు అగస్టిన్, ఆయన సమకాలికులైన ఫెలగిఉస్; 11వ శతాబ్దపు కన్టెర్బురి వాడిన అన్సేలం; 13వ శతాబ్దపు వాడైన ఇటాలియన్ ప్రీస్ట్ థామస్ అక్వినాస్; 16వ శతాబ్దపు ఫ్రెంచి వాడైన జాన్ కాల్విన్; 16వ శతాబ్దపు వాడైన డచ్ సేవకుడైన జకబుస్ ఆర్మినియుస్; మరియు బ్రిటిష్ ఆంగ్లికన్ సేవకుడైన 18వ శతాబ్దపు జాన్ వెస్లీ. ఈ దినము వరకు ముందుగా నిర్ణయించబడుట లేదా మానవుని స్వీయ స్వాతంత్రము అను విషయముల పై మత శాఖలతో చర్చ కొనసాగుతూనే ఉన్నది. [88]Zodhiates, 869. [89]J. Gresham Machen, *New Testament Greek for Beginners* (New York: Macmillan Co., 1957), 21–22 .